



బ్రహ్మరథంపై ఊరేగుతున్న స్వామి వారు

ఎన్నాళ్లీ నిరీక్షణ..?



జిల్లాలో ఇప్పటికే నాలుగు ఎమ్మెల్యే స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన తెలుగుదేశం పార్టీ రాజంపేట, రైల్వేకోడూరు స్థానాల విషయంలో ఎందుకనో.. ఆలస్యం చేస్తోంది. శుక్రవారం విడుదల చేసిన మూడవ జాబితాలోనూ.. ఈ రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. అదేవిధంగా రాజంపేట పార్లమెంటు అభ్యర్థి విషయంలోనూ.. అధిష్టానం దోబూచులాడుతోంది. అధికార పార్టీ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించేయడంతో వారంతా ప్రచారంతో పాటు.. అన్ని రకాల కార్యక్రమాల్లో క్షణం తీరిక లేకుండా.. హడావుడిగా ఉన్నారు. ప్రతిపక్ష టీడీపీ మాత్రం అభ్యర్థుల ప్రకటనలో మీనమేషాలు లెక్కిస్తోంది. దీంతో జిల్లాలోని తెలుగుతమ్ముళ్లు ఆందోళన చెందుతున్నారు.

- తేలని రాజంపేట, రైల్వేకోడూరు అభ్యర్థుల పంచాయితీ
- రాజంపేట పార్లమెంటుదీ అదే తీరు
- ఆందోళనలో తెలుగుతమ్ముళ్లు




(రాయచోటి-ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికలకు ఇంక కేవలం 51 రోజులు మాత్రమే గడువుంది. దీంతో ఇప్పటికే అధికార పార్టీ రెండు విడతల్లో జిల్లాలోని ఆరు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. తంబళ్లపల్లె పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మదనపల్లె నిస్సార్ అహ్మద్, పీలేరు చింతల రామచంద్రారెడ్డి, రాయచోటి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాజంపేట ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రైల్వేకోడూరుకు కొరముట్ల శ్రీనివాసులు పేర్లను ఖరారు చేసింది. రాజంపేట పార్లమెంటు అభ్యర్థిగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డినే బరిలో నిలిపింది. దీంతో అధికార పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారంతో పాటు ఓటర్లను ప్రలోభపెట్టే కార్యక్రమంలో క్షణం తీరిక లేకుండా ఉన్నారు. ఎన్నికల సంఘం ఎంత గొంతు చించుకుని వద్దని చెప్తున్నా.. గ్రామ, వార్డు వలంటీర్లను ఎన్నికల విధుల్లో తిప్పుతూనే ఉన్నారు. ఇంటింటికీ పంపించి.. తమకే ఓటు వేయాలని వలంటీర్ల ద్వారా ఓటర్లపై ఒత్తిడి తెస్తూనే ఉన్నారు. ఓటర్లకు కానుకలు కూడా పంపిణీ చేశారు. ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు అడ్డదారులు సైతం తొక్కుతున్నారు. అధికార పార్టీలో పరిస్థితి ఇలా ఉంటే.. ప్రతిపక్షంలో మరోలా ఉంది. జిల్లాలోని ఆరు అసెంబ్లీ స్థానాల్లో ఇప్పటికి రెండు విడతల్లో తంబళ్లపల్లె దాసరి జయచంద్రారెడ్డి, మదనపల్లె షాజహాన్‌బాషా, పీలేరు కిశోర్‌కుమార్‌రెడ్డి, రాయచోటి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిలను తమ అభ్యర్థులుగా బరిలో నిలిపింది. రాజంపేట, రైల్వేకోడూరు విషయంలో ఇంకా స్పష్టతకు రాలేదు.

ఇంకెప్పటికో.. స్పష్టత

తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలు కూటమిగా ఏర్పడి ఎన్నికలను ఎదుర్కొనబోతున్నాయి. జిల్లాలో రెండు పార్టీలకు టీడీపీ సీట్లను కేటాయించనుంది. దీంతో రాజంపేట, రైల్వేకోడూరులలో అభ్యర్థులను ప్రకటించడంలో తాత్సారం జరుగుతోంది.. ఇప్పటి వరకు ఉన్న సమాచారం ప్రకారం.. ఎస్సీ రిజర్వుడ్ స్థానం రైల్వేకోడూరును జనసేనకు కేటాయించినట్లు సమాచారం. దీంతో ఇక్కడ అభ్యర్థిని ప్రకటించుకునే బాధ్యత జనసేనదే. అయితే రాజంపేట విషయంలోనే.. అనేక విషయాలు ప్రచారంలో ఉన్నాయి. టీడీపీ తరపున ఇక్కడ టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, పోలిరెడ్డి సుబ్బారెడ్డి, మేడా విజయశేఖర్‌రెడ్డి, ఇంకా కొందరు, జనసేన తరపున గంటా నరహరి తదితరులు టికెట్టును ఆశిస్తున్నారు. అయితే కొత్తగా బీజేపీ కూడా ఈ రేసులో చేరినట్లు తెలుస్తోంది. రాజంపేట పార్లమెంటు పరిధిలో మదనపల్లె స్థానాన్ని బీజేపీకి కేటాయిస్తారనే ప్రచారం జోరుగా సాగింది. అయితే ఈ ప్రచారానికి తెరదించుతూ.. రెండవ జాబితాలో మదనపల్లె స్థానాన్ని మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు చంద్రబాబు కట్టబెట్టారు. ఈ పరిస్థితుల్లో రాజంపేట పార్లమెంటు పరిధిలో బీజేపీకి ఒక అసెంబ్లీ సీటును కేటాయించాలంటే.. కేవలం రాజంపేట మాత్రమే మిగిలి ఉంది. ఇక్కడ మాజీ ఎంపీ సాయిప్రతాప్ అల్లుడు సాయిలోకేశ్ టికెట్టును ఆశిస్తున్నారు. ఈ పరిస్థితుల్లోనే.. రైల్వేకోడూరు, రాజంపేట స్థానాల్లో అభ్యర్థుల విషయం కొలిక్కి రాలేదు.

తేలని రాజంపేట పార్లమెంటు స్థానం

రాజంపేట పార్లమెంటు పరిధిలో అసెంబ్లీ స్థానాల పరిస్థితి ఇలా ఉంటే.. రాజంపేట పార్లమెంటు స్థానంలో టికెట్టు విషయం కూడా ఇంకా అస్పష్టంగానే ఉంది. 2022లో రాజంపేట పార్లమెంటు స్థానానికి గంటా నరహరి పేరును చంద్రబాబు దాదాపు ఖరారు చేశారు. కలికిరిలో జరిగిన సమావేశంలో గంటా నరహరిని రాజంపేట పార్లమెంటు ఇన్‌చార్జ్‌గా ప్రకటించారు. అయితే తర్వాత ఏమైందో..? ఏమో.. అతని స్థానంలో సుగవాసి పాలకొండ్రాయుడు పెద్ద కుమారుడు సుగవాసి బాలసుబ్రమణ్యం తెరమీదకు వచ్చారు. పార్లమెంటు పరిధిలోని పరిస్థితులను బట్టి చంద్రబాబు.. బాలసుబ్రమణ్యం అభ్యర్థిత్వం వైపు మొగ్గు చూపారు. విజయవాడకు పిలిపించుకుని మాట్లాడి.. టికెట్టుపైన హామీ ఇచ్చి.. ప్రచారం చేసుకోమని చెప్పారు. దీంతో బాలసుబ్రమణ్యం నియోజకవర్గ వ్యాప్తంగా తిరుగుతూ.. పార్టీ ముఖ్యనాయకులను కలుస్తూ వచ్చారు. అయితే ఈ నేపథ్యంలోనే.. కేంద్రంలోని బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి ఏర్పడింది. దీంతో రాజంపేట పార్లమెంటు స్థానానికి బీజేపీ తరపున మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి తెరమీదకు వచ్చారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీకి 6 పార్లమెంటు స్థానాలను కేటాయించారు. ఇందులో విజయనగరం, అరకు, రాజమండ్రి, అనకాపల్లి, తిరుపతి, నరసాపురం ఉన్నట్లు ప్రచారం జరిగింది. అయితే మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి టికెట్టు విషయమై గట్టిగా పట్టుపట్టినట్లు ప్రచారంలో ఉంది. దీంతో శుక్రవారం ప్రకటించిన మూడవ విడతలో రాజంపేట పార్లమెంటు అభ్యర్థిని చంద్రబాబు ప్రకటించలేదు. బీజేపీతో చర్చలు జరిపిన తర్వాత.. ఒకటి రెండు రోజుల్లో ఈ స్థానంలో అభ్యర్థి విషయం ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.



బ్రహ్మరథంపై విహరించిన
లక్ష్మీనరసింహుడు

- గోవింద నామస్మరణతో మార్మోగిన తరిగొండ

గుర్రంకొండ, మార్చి 22: మండలంలోని తరిగొండ శ్రీలక్ష్మి నరసింహస్వామి వారు బ్రహ్మరథంపై విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయాన్నే స్వామివారిని మేల్కొలిపి ఆలయశుద్ధి, తోమాలసేవ, అర్చన, ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ స్వామివారిని బ్రహ్మరథంలో అధిష్ఠింపజేసి శాస్త్రోక్తంగా పూజలను చేశారు. బ్రహ్మరథంలో ఆశీనులైన స్వామివారి రథాన్ని లాగడానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. భక్తుల గోవింద నామస్మరణతో తరిగొండ మార్మోగింది. స్వామివారికి మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు చాందీని బండ్లు, అన్నం బండ్లను అధికంగా కట్టారు. సాయంత్రం సమయంలో ఎస్వీ మ్యూజిక్ కళాశాల బృందం ఆధ్వర్యంలో గాత్ర కచ్చేరిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, కృష్ణమూర్తి, వేద పండితులు కాండూరి శ్రీనివాసులు, గోపాల్‌భట్టర్, కృష్ణరాజు, కృష్ణప్రసాద్, అనిల్, గోకుల్, నరసింహులు, వెంకీ, వరద, సిబ్బంది నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ నివేదికలను ఎప్పటికప్పుడు పంపించాలి

- జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 22: సార్వత్రిక ఎన్నికలు- 2024 కొరకు జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ నుంచి రోజువారి నివేదికలను ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్‌కు పంపించాలని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్ నోడల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్‌మీనా, విజయవాడ నుంచి అన్ని జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సార్వత్రిక ఎన్నికలు- 2024పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖేశ్‌కుమార్‌మీనా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అన్ని విషయాల్లో సిద్ధంగా ఉండాలన్నారు. ఫారం-6, ఎంసీసీ, ఈఎస్ఎంఎస్, ఎఫ్ఎస్‌టీ తదితర అంశాలకు సంబంధించిన నివేదికలను ప్రతి రోజు సీఈవో కార్యాలయానికి తగిన సమయంలో చేరవేయాలన్నారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు 2024కు సంబంధించి రోజువారి నివేదికలను ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘానికి అందజేయాలని, ఈ విషయంలో ఎటువంటి అలసత్వాన్ని ప్రదర్శించరాదని నోడల్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎన్నికల విధుల్లో ఉన్న నోడల్ అధికారులు, ఎలెక్షన్ సెల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టోల్ ఫ్రీ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోండి

ఎన్నికల ఫిర్యాదులు, ఇతర వివరాల కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్‌ను (18004257090)ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం సార్వత్రిక ఎన్నికలు-2024కు సంబంధించి ఫిర్యాదులు, ఇతర వివరాలకు రాయచోటి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ టోల్‌ఫ్రీ నెంబర్ 24 ఇంటు 7 పనిచేస్తుందని, ఫిర్యాదుల కొరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1950 అదనంగా పనిచేస్తుందన్నారు.

ఆర్‌వో కార్యాలయాన్ని పరిశీలించిన ఎస్పీ



పీలేరు ఆర్‌వో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు

పీలేరు, మార్చి 22: పీలేరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఎస్పీ కృష్ణారావు శుక్రవారం సాయంత్రం సందర్శించారు. సార్వత్రిక ఎన్నికల కోసం పీలేరు తహసీల్దారు కార్యాలయంలో ఇది వరకే స్థానిక అధికారులు రిటర్నింగ్ అధికారి కార్యాలయం, కమాండ్ కంట్రోల్ రూము, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కార్యాలయం, ఎంసీసీ గదిని ఏర్పాటు చేశారు. ఆయా విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది, పనిచేసే విధానం, ఫిర్యాదుల పట్ల స్పందించే తీరును ఎస్పీ ఆయా సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, పోలీసుశాఖ తరపున అన్నివేళలా సహాయ సహకారాలు అందించేందుకు పీలేరు అసెంబ్లీ నియోజకవర్గ పోలీసు లైజనింగ్ అధికారులుగా సీఐ సాదిఖ్ అలీని నియమించామని, ఆయన ఇకపై ఆర్‌వో కార్యాలయంలో అందుబాటులో ఉంటారని వెల్లడించారు. కార్యక్రమంలో రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా, పీలేరు తహసీల్దారు మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

నిష్పాక్షికంగా విధులు నిర్వహించాలి : ఎస్పీ

కలికిరి, మార్చి 22: ఎన్నికల కోడ్ అమల్లో వున్నందున నియమావళిని అమలుపరచడంలో పోలీసు యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఎస్పీ బి.కృష్ణారావు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన కలికిరి పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం మహల్ గ్రామంలోని 162, 163 పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడున్న ఏర్పాట్లను పరిశీలించారు. కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టర్ మోహన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనపై కేసు నమోదు

గుర్రంకొండ, మార్చి 22: ఎన్నికల నియమావళిని అతిక్రమించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. పట్టణంలోని కొత్తపేటలో గల ఓ వీధిలో డ్రైనేజీ కాలువ పనులను వైసీపీ నాయకులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న అధికారులు పనులను ఆపేశారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎటువంటి అభివృద్ధి పనులు చేయరాదని, ఆంక్షలు ఉన్నప్పటికీ కాలువ పనులను ప్రారంభించడం తప్పన్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'ఎన్నికల నియమావళి వర్తించదా' అన్న శీర్షిక ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కోడ్ ఉల్లంఘనను శుక్రవారం గుర్తించిన ఎన్నికల అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారుల ఫిర్యాదు మేరకు పనులను చేయించిన నూర్ అహమ్మద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆంధ్రజ్యోతి స్పందన

'రూ.50 వేలకు మించి తీసుకెళ్లొద్దు'

కడప(కలెక్టరేట్), మార్చి 22: పెళ్లిళ్లు, ఇల్లు కట్టేందుకు, పిల్లల విద్యకోసం, అప్పుల చెల్లింపులకు ఇతర వ్యవహారాలకు సంబంధించి పెద్ద మొత్తంలో నగదు తీసుకెళుతున్నారా? తస్మాత్ జాగ్రత్త. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ప్రతి వ్యక్తి రూ.50 వేలకు మించి నగదు తీసుకెళితే ఎన్నికల నియమావళి ప్రకారం సీజ్ చేస్తారు. ఇతర ప్రాంతాలకు రూ.50 వేలకు మించి తీసుకెళ్లాల్సి వస్తే తగిన ఆధారాలతో వెళ్లాలి. లేకపోతే నగదును ఎన్నికల సంఘం నియమించిన కమిటీ అధికారులు సీజ్ చేస్తారు. ఈ మేరకు కమిటీలో ఎన్నికల నోడల్ అధికారిగా జి.నాగరాజారావు (చేనేత), మెంబర్లుగా ఆనంద్ నాయక్ (డీఆర్డీఏ), వెంకటేశ్వర్లు (జిల్లా ఖజానా శాఖ) అధికారులను నియమించారు.

కోడ్ ఉల్లంఘనపై..
విజిల్ వేయండి..!

- పౌరులకు అందుబాటులో సీవిజిల్ యాప్
- సామాన్యులు సైతం ఫిర్యాదు చేసే అవకాశం
- ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లోనే పరిష్కారం





కడప (ఎడ్యుకేషన్), మార్చి 22: అధికార పార్టీ నేతలు మా ఇష్టం, మమ్మల్ని ఎవరు ఏం చేస్తారు, మనకు అనుమతులు అవసరమా అంటూ బరితెగిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత కూడా అదే పంథాలో కొనసాగుతున్నారు. అనుమతులు లేకండానే సమావేశాలు నిర్వహించడం, ఎన్నికల తాయిలాలు ఇవ్వడం చేస్తున్నారు. కొన్నిచోట్ల ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, వలంటీర్లు ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటున్నారు. వీటికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసింది. ఇందులో సామాన్యులకు సైతం భాగస్వాములను చేస్తోంది. సీవిజిల్ యాప్ ద్వారా ఈ అవకాశం కల్పించింది. నిబంధనలు ఉల్లంఘించే వారిపై అధికారులు చర్యలు తీసుకునేలా సీవిజిల్ యాప్ సహకరించనుంది.

సీవిజిల్ యాప్

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఈ సీవిజిల్ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఎన్నికల ఉల్లంఘటనపై సాక్ష్యాలతో సహా అందులో పొందుపరవచ్చు. ఫొటో లేదా వీడియో ఆడియో రూపంలో రికార్డు చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ చేపట్టి వంద నిమిషాల్లో ఆ ఫిర్యాదుపై కచ్చితమైన చర్యలు తీసుకుంటారు. దీన్ని పౌరులు ఎవరైనా వినియోగించుకోవచ్చు.

యాప్ డౌన్‌లోడ్ ఇలా

గూగుల్ ప్లే స్టోరులో నుంచి కేంద్ర ఎన్నికల సంఘం వారి సీవిజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. మీ మొబైల్ నెంబరు ద్వారా దానిలో రిజిస్టరు చేసుకోగానే ఓటీపీ వస్తుంది దాన్ని నమోదు చేస్తే సీవిజిల్ యాప్ సిద్ధం. దాని ద్వారా మీరు ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.

వీటిపై ఫిర్యాదు చేయాలి

ఎన్నికల ప్రవర్తనా నియమావళికి భిన్నంగా ఉన్న దేనిపై అయినా ఫిర్యాదు చేయవచ్చు. డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతులు అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం.. ఇలాంటి ఉల్లంఘటనలు ఫొటో లేదా వీడియో ఆడియో రికార్డు చేసి అప్‌లోడ్ చేయాలి.

ఫిర్యాదు ఎలా చేయాలంటే..

సీవిజిల్ యాప్ తెరవగానే ఫొటో, వీడియో, ఆడియో అనే మూడు ఆప్షన్లు కనిపిస్తాయి. మీరు ఫొటో ద్వారా ఫిర్యాదు చేయాలంటే ఫొటో ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. మీ లోకేషన్ నమోదవుతుంది. ఉల్లంఘనకు సంబంధించి ఫొటో అప్‌లోడ్ చేయాలి. ఏ రాష్ట్రం ఏ నియోజకవర్గం తదితర వివరాలను నమోదు చేయాలి. సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరించాలి. ఇది ఎన్నికల సంఘానికి చేరుతుంది.

ఐదు నిమిషాల్లో రంగంలోకి..

యాప్‌లో వివరాలు పొందుపరచగానే జిల్లా ఎన్నికల అధికారి ఐదు నిమిషాల్లో దాన్ని ఫీల్డ్ యూనిట్‌కు పంపిస్తారు. వారు 15 నిమిషాల్లో ఘటన స్థలానికి చేరుకుంటారు. విచారించి 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిస్తారు. ఆయన దానిపై 50నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇలా ఫిర్యాదుపై 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే అవకాశం అందులో ఉంది.

అడ్డుకట్ట వేయాలి

తాయిలాలు పంచి అక్రమాలకు పాల్పడి అధికారం పీఠం ఎక్కాలనుకునే అరాచక రాజకీయ పార్టీలకు ఈ యాప్ ద్వారా చరమగీతం పాడవచ్చు. ఈ రోజే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఎక్కడైనా ఎన్నికల ఉల్లంఘన కనిపిస్తే ఫిర్యాదు చేయండి. అక్రమాలకు అడ్డుకట్ట వేయండి. రాష్ట్ర దేశ బంగారు భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వహించాలి.

మేమంతా.. మీ వెంటే..

- బాధితులకు భరోసా ఇచ్చిన నారా భువనేశ్వరి

కడప, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నారా చంద్రబాబునాయుడును జగన్ సర్కారు స్కిల్ డెవలప్‌మెంటు కేసులో అరెస్టు చేసి 53 రోజులు జైల్లో పెట్టింది. చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక పలువురు ఆయన అభిమానులు గుండెపోటుతో మృతిచెందారు. దీంతో 'నిజం గెలవాలి' పేరుతో నారా భువనేశ్వరి రాష్టవ్యాప్తంగా పర్యటిస్తూ బాధితులను పరామర్శిస్తున్నారు. ఇందులో భాగంగా ఆమె శుక్రవారం బి.కోడూరు, కలసపాడు మండలాల్లో నాలుగు కుటుంబాలను పరామర్శించి వారిలో ధైర్యం నింపారు. బాధిత కుటుంబాల ఆవేదనను చూసి భువనేశ్వరి భావోద్వేగానికి గురయ్యారు. మీరంతా టీడీపీ కుటుంబం. మీకు చంద్రబాబు, నారాలోకేశ్ సహా పార్టీ అంతా మీ వెంటే ఉంటుంది. మీకు ఏ కష్టమొచ్చినా పార్టీ వెంట ఉంటుంది. మీరు అధైర్యపడొద్దు అంటూ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పుడు రాష్ట్రమంతా గంజాయి, లిక్కర్, భూకబ్జాలకు నిలయంగా మారిపోయిందని, పిల్లలకు ఉద్యోగాలు రావాలన్నా, భవిష్యత్తు బాగుండాలన్నా టీడీపీని గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. చంద్రబాబు అరెస్టుతో ఆవేదనకు గురై మృతి చెందిన ముచ్చుమర్రికి చెందిన ఓబుల్‌రెడ్డి కుటుంబం, కలసపాడు మండలం హృదయపేటకు చెందిన డేవిడ్, బ్రాహ్మణపల్లెకు చెందిన వెంకటయ్య, తెల్లపాడుకు చెందిన చెంచిరెడ్డి కుటుంబాలను ఆమె పరామర్శించారు.

ఒంటరి మహిళలే టార్గెట్

- నగరంలో గొలుసు దొంగతనాలు
- ఈజీ మనీ కోసం పెడదారి పడుతున్న యువత
- కొరవడుతున్న పోలీసు నిఘా



కడప (క్రైం), మార్చి 22: ఈజీ మనీ కోసం కొంత మంది యువత పెడదారి పడుతున్నారు. పనిపాట లేకుండా జులాయిగా తిరిగే కొందరు జల్సాలకు అలవాటుపడి ఈజీ మనీ కోసం నేర ప్రవృత్తికి అలవాటు పడుతున్నారు. ముఖానికి హెల్మెట్, మాస్కులు పెట్టుకుని ఒంటరి మహిళలే లక్ష్యంగా గొలుసు దొంగతనాలకు పాల్పడుతు న్నా రు. మహి ళల మెడల్లో ఉన్న బంగారు వస్తువుల్లో ఏది చేతికి దొరి కితే దాన్ని తెంపుకుని క్షణాల్లో మాయం అవుతున్నారు. ఆ సమయంలో మహిళలు కింద పడి తీవ్రంగా గాయపడిన సంఘటనలు ఉన్నాయి.

కడప నగరంలో ఇటీవల నాలుగు చైన్ స్నాచింగ్ కేసులు నమోదయ్యాయి. కడపతో పాటు ఇతర ప్రాంతాల్లో సైతం ఒంటరి మహిళలను టార్గెట్ చేసుకుని ఈ గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్నారు. తలకు టోపీ లేదా హెల్మెట్ ధరించి ముఖానికి మాస్కులు పెట్టుకుని నెంబరు ప్లేటు లేని వాహనాల్లో వెళుతూ ఒంటరిగా వెళ్లే మహిళలను లక్ష్యంగా చేసుకుని.. జనాలు లేని నిర్మానుష్య ప్రాంతాల్లో వారి మెడల్లోని గొలుసులను లాక్కెళుతున్నారు. ఆ సమయంలో మహి ళలు కింద పడి గాయాలపాలవుతన్నా పట్టించుకోకుండా చేతికి దొరికిన బంగారు గొలుసుతో ఉడాయిస్తున్నారు.

ప్రజల మధ్యనే తిరుగుతూనే...

నగరంలో చైన్‌స్నాచర్లు బరి తెగిస్తున్నారు. వీళ్ల సామాన్యుల్లాగా నిత్యం ప్రజల మధ్య తిరుగుతూ ఒంటరిగా వెళ్లే మహిళల కదలికలను గమ నిస్తుంటారు. అదును చూసి బైకులో వచ్చి చిన్నపాటి కత్తెరతో చాలా సులభంగా గొలుసులు కత్తిరించి లాక్కెళుతున్నారు. ఈనేరాలకు పాల్ప డుతున్న వారంతా యువకులే అని తెలుస్తోంది. ఒకవేళ ఎవరైనా ప్రతిఘటిస్తే వారిపై దాడులకు వెనుకాడడం లేదు. గొలుసులు తెంపే ప్రయత్నంలో మహిళలు రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడుతున్నారు.

కొరవడుతున్న పోలీసు నిఘా

ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో ఐడీ పార్టీ పేరుతో కొంత మంది సిబ్బంది తిరుగుతుంటారు. కానీ దొంగలను గుర్తించడంలో వీరు పూర్తిగా విఫ లమవుతున్నారనే ఆరోపణలున్నాయి. సిబ్బంది కొరత, నగరంలో కొన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడం తదితర సమస్యలతో నిందితులను గుర్తించలేకపోతున్నారు. గతంలో అయితే ఎవరు దొంగత నం చేసినా ఇట్టే తెలిసిపోయేది. ప్రస్తుతం దొంగలు అప్‌డేట్ కావడంతో ఎవరు స్నాచింగ్‌కు పాల్పడుతున్నా రనేది తెలుసుకోవడం కష్టతరంగా మారింది. ఐడీ పార్టీ పోలీసులు కూడా పూర్తి స్థాయిలో నిఘా పెట్టకపోవడంతోనే వరుసగా గొలుసు చోరీలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.
ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో జన సమ్మర్ధం లేని ప్రాంతాల్లో నిరంతర పెట్రోలింగ్‌తో పాటు కఠిన చర్యలు తీసు కుంటే తప్ప గొలుసు దొంగతనాలకు అడ్డుకట్ట పడే పరిస్థితుల కనిపించడంలేదు.

ఇటీవల జరిగిన గొలుసు దొంగతనాలు

- వారం రోజుల క్రితం కడప చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో ఒంటరిగా నడుచుకుంటూ వెళుతున్న మహిళ మెడలోని మూడు తులాల బంగారు గొలుసు ద్విచక్ర వాహనంలో వచ్చిన ఇరువురు లాక్కెళ్లారు.
- ఈ ఏడాది జనవరి 19న లింగాలలో మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని దొంగలు నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లారు.
- ఫిబ్రవరి 16న కమలాపురంలో దొంగలు ఓ మహిళ నుంచి మూడు తులాల గొలుసు చోరీ చేశారు
- మార్చి 3న వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో హౌసింగ్‌బోర్డు కాలనీలో మహిళ వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని దుండగులు వాహనంలో వచ్చి ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసు లాక్కెళ్లారు.
- మార్చి 4న కడప ఎన్జీవో హోంలో నడుచుకుంటూ వెళుతున్న మహి ళ మెడలో నుంచి మూడుతులాల బంగారు గొలుసు లాక్కెళ్లారు. గతంలో తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో లగేజీ బ్యాగుతో వెళుతున్న మహి ళ వెనకనే వచ్చి చాకచక్యంగా ఆమె మెడలోని బంగారు గొలు సును అపహరించి పారిపోయారు. ఇలాంటి ఘటనలతో ఒంటరిగా వెళ్లే మహళలు భయాందోళనకు గురవుతున్నారు.

ప్రశాంతంగా ఓపెన్ స్కూలు పరీక్షలు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 22: జిల్లాలో ప్రశాంతంగా ఏపీ సార్వత్రిక పరీక్షలు జరుగుతున్నాయని డీఈవో అనురాధ తెలిపారు. శుక్రవారం ఆమె పరీక్షలను పరిశీలించారు. జిల్లాలో 13 కేంద్రాల్లో పదోతరగతికి సంబంధించి పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ఈ పరీక్షలకు 2231 మందికి గాను 2002 మంది హాజరయ్యారని తెలిపారు. అలాగే ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి జిల్లాలో 28 కేంద్రాల్లో 3735 మందికి 3514 మంది హాజరయ్యారని.. 221 మంది గైర్హాజరయ్యారన్నారు. ఈ పరీక్షలను 13 మంది ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 41 కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. అలాగే జిల్లా పరిశీలకులు ఎంవీ క్రిష్ణారెడ్డి, డీఈవో పలు కేంద్రాలు పరిశీలించినట్లు తెలిపారు.

పుట్టగొడుగుల పెంపకం లాభదాయకం



పుట్టగొడుగుల పెంపకంపై వివరిస్తున్న శాస్త్రవేత్త

సీకేదిన్నె, మార్చి 22: పుట్టగొడుగుల పెంప కం లాభదాయకమని.. యువత దృష్టి సారించాలని శాస్త్రవేత్త సాయిమహేశ్వరి తెలిపారు. స్థానిక ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్ట గొడుగులు మంచి పోషకాలు గల ఆహారమని.. పుట్టగొడుగుల పెంపకంపై దృష్టి సారించి యువ త ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని తెలిపారు. అనంతరం వివిధ రకాల పుట్టగొడుగుల తయారీ విధానం గురించి యువతకు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు



బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై పరిశీలిస్తున్న ఏఎస్పీ వెంకటరాముడు

ఒంటిమిట్ట, మార్చి 22: కోదండరాముడి బ్రహ్మోత్సవాలకు పటిష బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు తెలిపారు. శుక్రవారం ఒంటిమిట్ట కోదండరామాలయ పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. కల్యాణోత్సవం రోజు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కల్యాణ వేదిక, కోదండరామాలయం పరిసర ప్రాంతం, కల్యాణం రోజు హైవేపై వెళ్లే వాహనాల దారి మళ్లింపు అంశాలను డీఎస్పీ షరీఫ్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ పురుషోత్తంరాజు, ఎస్ఐ మధుమోహన్‌రావు, పోలీసులు పాల్గొన్నారు.

కడప శ్రీనగర్ కాలనీలో చోరీ

- 9 తులాల బంగారు నగల అపహరణ

కడప (క్రైం), మార్చి 22: కడప నగరం శ్రీనగర్ కాలనీలో ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి నరసింహులు ఇంట్లో దొంగలు పడి తొమ్మిది తులాల బంగారు నగలను చోరీ చేసినట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న నరసింహులు బుధవారం ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల దైవదర్శనానికి వెళ్లి తిరిగి శుక్రవారం ఇంటి చేరుకున్నారు. ఇంటి తాళాలు పగల గొట్టినట్లు ఉండటంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా ధ్వంసం చేసినట్లు గమనించారు. దీంతో పోలీసులుకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బీరువాలో ఉన్న తొమ్మిది తులాల బంగారు నగలు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుజిరీ దుకాణంలో...: కడప ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఓ గుజిరీ సామాన్లు విక్రయించే దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తి చొరబడి క్యాష్ కౌంటర్‌లోని రూ.20వేల నగదు, సెల్ ఫోన్ అపహరించారు. దుకాణం యజమాని సల్మా తమకు ఫిర్యాదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

జగనాసుర పాలన అంతానికే మూడు పార్టీల కూటమి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 22: పురాణాల్లో రాక్షసులను అంతం చేయ డానికి దేవతలంతా ఒక్కటైనట్లు రాష్ట్రంలో జగనాసుర పాలన అంతానికి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి ఏర్పడిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు రెడప్పగారి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రొద్దుటూరులో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల సమన్వయ సమావేశం జరిగింది. ఈసందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడానికి వేల కోట్ల రూపాయలు అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలా తీయించాడన్నారు. మోదీ నాయకత్వంలో దేశం ముందుకు వెళుతుంటే రాష్ట్రం అన్ని విధాల వెనుకబడి అరాచకంలో ముందు ఉందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొవ్వూరు బాలచంద్రా రెడ్డి మాట్లాడుతూ 45 ఏళ్ల ప్రొద్దుటూరు రాజకీయ చరిత్రలో వరదరాజులరెడ్డి 25 ఏళ్లు వరుసగా ఎమ్మెల్యే అయినా ఏనాడు ఆయనను విమర్శించిన వాళ్ల మీద ప్రతిదాడి చేయలేదన్నారు. రాచమల్లు అరాచకపాలనను విమర్శించినందుకు, మున్సిపల్ స్కూలులో మార్కెట్ కట్టవద్దని పోరాడినందుకు 1.60 కోట్ల విలువైన నా సూపర్ మార్కెట్‌ను ఎమ్మెల్యే రాచమల్లు కక్ష్యకట్టి మూయించి నన్ను తీవ్రంగా నష్టపరిచాడన్నారు. గొర్రె శ్రీనివాసులు మాట్లాడుతూ 2019లో రాచమల్లు ఎన్నికల ముందు 30 కోట్ల అప్పులతో ఉన్నాడన్నారు. నేడు 1200 కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించాడని రాష్ట్ర ఇంటలిజెన్సీ రిపోర్టు జగన్ దగ్గరే వుందన్నారు. రాచమల్లును మళ్లీ గెలిపిస్తే పెన్నానదిలో వున్న ఆ కొంత ఇసుక మిగలదన్నారు. ప్రభుత్వం భూములు ప్రైవేటు ఆస్తులు పూర్తిగా కబ్జా అవుతాయని విమర్శించారు. జనసేన రాష్ట్ర ప్రోగ్రాం కమిటీ సభ్యుడు జిలాన్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఇంటింటికి వచ్చి మీకు ఫించన్లు, ఆసరా, విద్యా దీవెన, అమ్మఒడి లాంటివన్నీ కలిపి లక్షలు నగదు ఇచ్చామని చెప్పి కార్డులు పంచుతున్నారన్నారు, కానీ జనాల నుంచి కరెంట్ బిల్లులు, ఇంటి పన్నులు, ఆర్టీసీ బస్సు చార్జీలు, పెట్రోల్, డీజల్ ధరలు పెంచి ఇంత దోచుకున్నామని ఎందుకు బ్రోచర్లు పంచరని ప్రశ్నించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషన్‌రెడ్డి మాట్లా డుతూ రాచమల్లు అరాచక పాలనును ప్రొద్దుటూరులో అంతం చేయడానికి బీజేపీ కూటమిలో క్రియా శీలకంగా పనిచే స్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ మూడు పార్టీల నేతలను, కార్యకర్తలను సమన్వయం చేసుకుని ఎన్నికల పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎల్లారెడ్డి, జనసేన నాయకుడు సుంకర మురళీ రామారావు, బీజేపీ నాయకులు బోగా శివకళ్యాణి, రాఘేవంద్రారెడ్డి, బాస్కర్‌రెడ్డి చింతకుంట జయలక్ష్మి, టీడీపీ నాయకులు రాఘవరెడ్డి, కొండారెడ్డి, బచ్చల పుల్లయ్య తోట మహే శ్వరరెడ్డి. ఘంటశాల వెంకటేశ్వర్లు తదిరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఇంటర్ విద్యార్థి మృతి

ములకలచెరువు, మార్చి 22: వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డ ఇంటర్ విద్యార్థి జశ్వంత్‌కుమార్(25) శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు...మండలంలోని బురకాయలకోట పం చాయతీ బలకవారిపల్లెకు చెందిన జశ్వంత్‌కుమార్(25) ఇంటర్మీడియట్ పరీక్షలు రాసి ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 19న పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో బురకాయలకోటకు బయలుదే రి వెళుతుండగా మార్గం మధ్యంలో బొలెరో వాహనం ఢీకొన డంతో తీవ్రంగా గాయపడ్డ విషయం విదితమే. ఈ ప్రమా దంలో తీవ్రంగా గాయపడ్డ విద్యార్థిని బెంగళూరులోని ఓ ప్రైవే టు ఆస్పత్రికిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం స్వగ్రా మానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. విద్యార్థి మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా ముంబాయి - చెన్నై జాతీయ రహదారి విస్తరణ పనులు చేస్తున్న డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా వాహనాన్ని నడప డంలో ప్రమాదానికి కారణమైందని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.

ఏడుగురుకి జైలు శిక్ష

బద్వేలు రూరల్, మార్చి 22: బద్వేలు కోర్టులో శుక్రవారం సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ ఏడుగురు నిందితులకు 3 నెలలు జైలు శిక్ష లేదా రూ.10వేలు జరిమానా విధించినట్లు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవి చంద్ర తెలిపారు. 2008వ సంవత్సరంలో బ్రహ్మంగారిమఠం పోలీసు స్టేషన్ పరిధిలోని లింగాలదిన్నె గ్రామంలో రెండు వర్గాల మధ్య జరిగిన భూతగా దాకు సంబంధించి కేసు నమోదైంది. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాక్షుల తరుఫున వాదనలు వినిపించి నిందితులకు శిక్ష పడేలా చేసినట్లు తెలిపారు.

ఎంపీటీసీపై కేసు

చాపాడు, మార్చి 22: మండలంలోని అయ్యవారిపల్లె గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు చెమికల రమాదేవి ఆమె భర్త మాధవరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శంకరయ్య తెలిపారు. వీరిద్దరు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి శుక్రవారం ఆ గ్రామంలో కొత్తగా శ్రీరాముల దేవాలయం నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం సీజీఎస్ గ్రాంట్ కింద దేవాదాయ శాఖకు సంబంధించి రూ.10 లక్షలు ఈ దేవాలయ నిర్మాణానికి మంజూరు చేసింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి భూమి పూజలో పాల్గొన్నారు. ఎంపీడీవో మహబూబ్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ మద్యం దుకాణ సూపర్‌వైజర్, సేల్స్‌మెన్‌ల తొలగింపు



ఎమ్మెల్యే రాచమల్లుతో ప్రచారంలో పాల్గొన్న ప్రభుత్వ మద్యం దుకాణ సూపర్‌వైజర్, సేల్స్ మెన్‌లు

ప్రొద్దుటూరు, మార్చి 22: ప్రొద్దుటూరు వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లుతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్న సూపర్‌వైజర్ నాగేష్, సేల్స్‌మెన్ ఓబులేసులను విధుల నుంచి తొలగిస్తూ ప్రొద్దుటూరు ఏపీఎస్‌బీసీఎల్ ఏఎంఎఫ్ఎల్ డిపో మేనేజర్ ఉత్తర్వులు జారీ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో మద్యం దుకాణాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలలో చేరిన వారు, ముఖ్యంగా వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని ఒత్తిడి పెంచడంతో కొందరు విధిలేని పరిస్థితుల్లో పాల్గొంటున్నామని చెబుతున్నారు. దీంతో ఎన్నికల కమిషన్ మాత్రం ఎవ్వరైనా ప్రభుత్వ సంస్థల్లో పనిచేసేవారు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులతో పాటు పాల్గొంటే వెంటనే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరిస్తున్నా రు. అయినా కొందరు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, మెప్మా ఆర్‌పీలు, సీవోలు మద్యం దుకాణంలో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొంటున్నారు. వీరిపై ఫ్లయింగ్ స్క్వాడ్‌లు నిఘాపెట్టి కేసులు నమోదు చేసి విధుల నుంచి తొలగించటంలో కఠినంగా వ్యవహరిస్తున్నారు.

ఎన్‌టీ పల్లె వలంటీరు తొలగింపు

నందలూరు, మార్చి 22: నల్లతిమ్మాయపల్లె గ్రామ వలంటీరు తుంటి యల్ల య్యను విధుల నుంచి తొలగిస్తూ ఇన్‌చార్జి ఎంపీడీవో సతీష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఆకేపాడు గ్రామంలోని ఆకేపాడు ఎస్టేట్‌లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డితో ఫొటో దిగడంతో చర్యలు తీసుకున్నట్లు ఎంపీ డీవో తెలిపారు. వలంటీరు నుంచి సెల్‌ఫోను, బయోమెట్రిక్ డివైజ్‌లు, క్లస్టర్ రికార్డులను పంచాయతీ కార్యదర్శి స్వాధీనం చేసుకున్నారు.

సిద్దవటంలో...

సిద్దవటం, మార్చి 22: మండలంలోని బొగ్గిడివారిపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని పాలకొండ్రాయునిపల్లె క్లస్టర్ వలంటీరు బత్తల సుధాకర్ విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలియజేశారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఈనెల 22న వడ్డేవారిపల్లెలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన డంతో అతన్ని విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎవరైనా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే అటువంటి వారిపై చర్యలు తప్పవని ఆయన తెలియజేశారు.

మహిళ అదృశ్యం



ఒంటిమిట్ట, మార్చి 22: ఒంటిమిట్ట మెయిన్ బజార్‌కు చెందిన కట్టా సుబ్బలక్ష్మి (57) అనే మహిళ గురువారం రాత్రి నుంచి కనబడటం లేదని వారి కుమారులు పోలీ సులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని, ఎవరికైనా సమాచారం తెలిస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

మెడికల్ రెప్రజెంటేటివ్ ఆత్మహత్య

మదనపల్లె టౌన్, మార్చి 22: మదనపల్లె మండలం రామాచార్లపల్లెలో నివాసమున్న దశరథశెట్టి కుమారుడు, మెడికల్ రెప్రెజెంటేటివ్ అమరనాథ్(30) గురువారం అర్ధరాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పూతలపట్టు మండలానికి చెందిన అమరనాథ్, శోభారాణి దంపతులు నాలుగేళ్లుగా రామాచార్లపల్లెలో నివాసముంటున్నారు. మెడికల్ రెప్రెజెంటేటివ్‌గా పనిచేస్తున్న అమరనాథ్ ఇటీవల ఆర్థిక కారణాలు, మానసిక ఒత్తిడితో మనస్థాపం చెందేవాడు. దీంతో అతని ఇంట్లోనే ఫ్యాన్ కొక్కికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శోభారాణి ఫిర్యాదు మేరకు తాలూకా సీఐ శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ స్టోర్‌పై దాడులు.. మందులు సీజ్



మెడికల్ స్టోర్‌లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

చక్రాయపేట, మార్చి 22: మండలంలోని నాగులగుట్టపల్లెలో విజయలక్ష్మి మెడికల్ స్టోర్‌పై శుక్రవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. కడప రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ షేక్ మాసూంబాష ఆదేశాల మేరకు విజిలెన్స్ డీఎస్పీ నాగరాజారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులతో కలిసి మెడికల్ స్టోర్‌లో తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ స్టోర్‌లో 35 రకాల మందులు (అమ్మకూడనివి) అమ్ముతున్నారని, అలాగే పశువులకు సంబంధించిన మందులు ఉండటం వల్ల సీజ్ చేసినట్లు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మాధవి తెలిపారు. అలాగే మెడికల్ స్టోర్ వెనుక వైపు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న చికిత్సా కేంద్రాన్ని సీజ్ చేశారు. దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రెడ్డప్ప, అసిస్టెంట్ జియాలజిస్ట్ శ్రీనివాసులు, అగ్రికల్చర్ ఆఫీసర్ బాలగంగాధర్‌రెడ్డి, డీఎస్‌పీఓ డాక్టర్ వెంకటచంద్రారెడ్డి, రాయచోటి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి రేపు ప్రత్యేక బస్సులు

కడప (మారుతీనగర్), మార్చి 22: తమిళనాడులోని అరుణాచల గిరిప్రదక్షిణ కోసం ఆదివారం జిల్లాలోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. **బస్సుల వివరాలిలా..**

- కడప డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు (6002) ఉదయం 5 గంటలకు బయలుదేరి రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా వెళుతుంది. ఇందులో టికెట్ ధర రూ.1,072
- బద్వేల్ డిపో నుంచి రెండు బస్సులు (9569, 60009) ఉదయం 7 గంటలకు బయలుదేరతాయి. కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా ఒక బస్సు.. మరో బస్సు పెంచలకోన, శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా వెళతాయి. ఇందులో చార్జి రూ.1,566, రూ.1,475
- మైదుకూరు డిపోకు చెందిన రెండు సూపర్ లగ్జరీ బస్సులు (97876, 95678) పోరుమామిళ్ల నుంచి బయలుదేరుతాయి. ఒకటి ఉదయం 6 గంటలకు బయలుదేరి మైదుకూరు, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా... మరో బస్సు సాయంత్రం 6 గంటలకు బయలుదేరి కడప మీదుగా వెళుతుంది. ఇందులో చార్జి రూ.1,414, రూ.1,214
- ప్రొద్దుటూరు డిపో నుంచి బస్సు (9944) మధ్యాహ్నం 3.00 గంటలకు బయలుదేరి వయా మైదుకూరు కడప మీదుగా వెళుతుంది. ఇందులో చార్జి రూ.1,273
- జమ్మలమడుగు నుంచి సూపర్ లగ్జరీ బస్సు (98398ఎ) రాత్రి 8 గంటలకు బయలుదేరి ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా వెళుతుంది. చార్జీ రూ.1,352
- పులివెందుల డిపో నుంచి సూపర్‌లగ్జరీ బస్సు (59900) ఉదయం 7 గంటలకు బయలుదేరి పీలేరు, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం చేరుతుంది. ఇందులో టికెట్ రూ.1,242.

ఉద్యోగాల పేరుతో మోసం...పోలీసులకు ఫిర్యాదు

మదనపల్లె, మార్చి 22: బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఓ మహిళ మోసం చేసిందని బాధితు లు పోలీసులను ఆశ్రయించారు. నిమ్మనపల్లె మండలం అగ్రహా రం పంచాయతీ ఉంటావారిపల్లెకు చెందిన ఎం.నందిని..తమను మోసం చేసిందని తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు.. నిమ్మనపల్లె, మదనపల్లె, కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు ప్రాంతాలకు చెందిన చదువుకున్న నిరుద్యోగ యువతుల నుంచి ఆధార్, రేషన్‌కార్డు, ఎడ్యుకేషన్ రికార్డులు తీసుకుందని, శిక్షణ పేరుతో కర్ణాటక ప్రాంతం రాయల్పాడుకు రెండుసార్లు తీసుకెళ్లినట్లు తెలిపారు. శిక్షణ పూర్తయ్యాక.. మదనపల్లె, రాయల్పాడు ఏరియాలలో కార్యాలయం ఏర్పాటు చేసి ఉపాధి మార్గాలను చూపిస్తామని చెప్పినట్లు బాధితులు పేర్కొన్నారు. ఇందుకోసం తమ వద్ద రూ.10వేల నుంచి రూ.20వేలు వసూలు చేసినట్లు తెలిపారు. ఇంతకాలం శిక్షణ, కార్యాలయం ప్రారంభం పేరుతో కాలయాపన చేసిన నిందితురాలు..తాము నిలదీస్తే..సరైన సమాధానం ఇవ్వకుండా దాటవేస్తోందని విచారించి తమకు న్యాయం చేయాలని వారు పోలీసులను కోరుతున్నారు.

అయితే..నిందితురాలు తమ పరిధిలో లేదని, బాధితులు తమ ఏరియాకు రారని రాయల్పాడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లండని పోలీసులు సూచించినట్లు బాధితులు చెబుతున్నారు. ఇదిలా వుండగా, నిమ్మనపల్లె మండలానికి చెందిన నందినికి ఆరేళ్ల క్రితం వివాహం కాగా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండేళ్లుగా భర్తకు దూరంగా ఉంటున్న ఆమె ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నట్లు చెబుతూ.. అక్కడ ఉద్యోగాలు ఇప్పిస్తానని యువతుల వద్ద డబ్బులు తీసుకుని మోసం చేస్తున్నట్లు బాధితులు వాపోయారు. ఆమె పనిచేస్తున్న కంపెనీలో మేనేజర్‌గా, సీని యర్ డైరెక్టర్‌గా ఉన్నట్లు విజిటింగ్ కార్డులతో ప్రచారం చేసిన ట్లు బాధితులు పేర్కొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

సుండుపల్లె, మార్చి 22: మండల కేంద్రంలోని రాయచోటి రోడ్డు, బైర వగుట్ట ప్రాంతాల్లో సుండుపల్లె ఎస్‌ఐ ఎస్‌కేయం హుస్సేన్ శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. రూ. 50 వేలకు మించి నగదు తీసుకురాకూడదని వాహనదారులకు సూచించారు. అలా ఎవరైనా తరలించాలంటే పోలీసుల దగ్గర అనుమతులు తీసుకో వాలని తెలియపరిచారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనాలకు సంబంధించిన పేపర్లు లేని వారికి జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డీసీసీ మీడియా కోఆర్డినేటర్‌గా మన్సూర్‌అలీఖాన్



రాయచోటిటౌన్, మార్చి 22: జాతీయ కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా మీడియా కోఆర్డినేటర్‌గా డీసీసీ మైనా ర్టీ చైర్మన్ ఆడిటర్ మన్సూర్ అలీఖాన్‌ను నియమిస్తూ శుక్రవారం పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి, రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్. తులసిరెడ్డి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, డీసీసీ అధ్యక్షుడు అల్లాబకష్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో, తహసీల్దార్

సంబేపల్లె, మార్చి 22: ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఎంపీడీవో నిర్మలాదేవి, తహసీల్దార్ శ్రీనివాసులు తెలియజేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వీఆర్‌వో, పంచాయతీ సెక్రటరీలతో సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో గోడలపై పోస్టర్లు, రాతలు లేకుండా చూడాలని తెలి యజేశారు. వలంటరీర్లు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకుండా హెచ్చరించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల విశిష్టతపై అవగాహన



మాట్లాడుతున్న సీడీపీవో సౌభాగ్యమ్మ

రైల్వేకోడూరు, మార్చి 22: చిరుధాన్యాల విశిష్టతపై ఉంగరాలనగర్‌లో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో పిల్లల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలకు శుక్రవారం ఐసీడీఎస్ సీడీపీవో సౌభాగ్యమ్మ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ పఖ్వాడా కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. తల్లిపాల ప్రయోజనాలను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'అరాచక ప్రభుత్వానికి చరమగీతం పాడుదాం'



ఎన్నికల ప్రచారంలో నిశ్చల్ నాగిరెడ్డి

చిన్నమండెం, మార్చి 22: అరాచక ప్రభుత్వానికి చరమగీతం పాడుదామని రాయచోటి టీడీపీ అభ్యర్థి సతీమణి హరితరెడ్డి, కుమారుడు నిశ్చల్ నాగిరెడ్డి, కుమార్తె నాగజ్యోతి పిలుపునిచ్చారు.

శుక్రవారం వారు దేవగుడిపల్లె, కుర్వపల్లె, కండమూల, జల్లావాండ్లపల్లె, బాహూజీనగర్ కాలనీలో ఇంటింట తిరుగుతూ వైసీపీ ప్రభుత్వం అరాచకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా మన పిల్లల భవిష్యత్ బాగుండాలన్న తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. సంక్షేమం అభి వృద్ధి దృష్టిలో పెట్టుకొని టీడీపీ ప్రభుత్వం పాలిస్తుం దన్నారు. పొరపాటున మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తే మన భూములను సైతం వైసీపీ వారు లాక్కుంటారన్నారు. కావున ఆ పార్టీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపే సమయం ఆసన్నమైందని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మూల్యాంకన సమస్యలను పరిష్కరించండి

- జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు అంకం శివారెడ్డి



డీఈవో శివప్రకాశ్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎస్టీయూ నేతలు, ఉపాధ్యాయులు

రాయచోటిటౌన్, మార్చి 22: పదవ తరగతి మూల్యాంకన సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ అన్నమ య్య జిల్లా అధ్యక్షులు అంకం శివారెడ్డి డిమాండ్ చే శారు. శుక్రవారం ఆయన ఎస్టీయూ నేతలు, ఉపాధ్యాయులతో కలిసి అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల మూ ల్యాంకనం నుంచి దీర్ఘకాలిక వ్యాధులు, వెన్నునొప్పి వంటి సమస్యలతో బాధపడుతున్న, పదవీ విరమణకు దగ్గరలో ఉన్న ఉపాధ్యాయులతోపాటు, జిల్లా కేంద్రానికి (స్పాట్ సెంటర్‌కు) దూరంగా పనిచేస్తున్న, నివాసం ఉంటున్న మహిళా ఉపాధ్యాయులు,చంటి బిడ్డల తల్లులు, ప్రమోషన్ పొంది మూడేళ్ల పూర్తి కాని స్కూల్ అసిస్టెంట్లకు స్పాట్ వాల్యుయేషన్ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూల్యాంకన కేంద్రాల్లో బల్లలు, కుర్చీలు, ఎండ తీవ్రత దృష్ట్యా కూలర్లు, ఫ్యాన్లు, వాటర్‌కూలర్లు, మహిళలకు, పురుషులకు వేర్వేరు వాష్ రూమ్స్‌లు తదితర కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. గత సంవత్సరం మూల్యాంకన విధుల్లో పాల్గొన్న కొంత మంది ఉపాధ్యాయులకు ఇంతవరకు రెమ్యూనరేషన్ ఇవ్వలేదన్నారు. ఇలాంటి సమస్యలపై తగిన చర్యలు తీసుకొని, బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా డీఈ వో శివప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని సమస్యలను పరిష్కరిస్తామని సమాధాన మిచ్చారు. ఈ కార్యక్ర మంలో ఎస్టీయూ నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల తనిఖీ

లక్కిరెడ్డిపల్లె మార్చి 22: మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో పదోవ తరగతి పబ్లిక్ పరీక్షలను జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఏ సెంటర్ బి సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్‌అమలులో ఉందని బయటి వ్యక్తులు ఎవరూ పరీక్ష కేంద్రం వద్ద కనిపించకూడదని పోలీసులకు సూచించారు .సెల్‌ఫోన్లు పరీక్ష కేంద్రంలో అనుమతించకూడదన్నారు.

ఘనంగా ముక్కా నూతన కార్యాలయ ప్రారంభం



ఓబులవారిపల్లె: పూజల్లో ముక్కా రూపానందరెడ్డి దంపతులు

రైల్వేకోడూరు, మార్చి 22: మండలంలోని రాఘవ రాజపురం గ్రామ ప్రధాన దారికి పక్కనే ఉన్న భవనంలో శుక్రవారం టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తన నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి పోరు వైసీపీ పైనే ఉంటుందన్నారు. మునుపెన్నడు ఎవరు చేయలేని విధంగా ప్రచారాలు ఉంటాయన్నారు. ఎవరు ఊహించని విధంగా అభ్యర్థి విజయం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం లో ఆయన సతీమణి ముక్కా వరలక్ష్మి, టీడీపీ నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతారాములకు పూజలు

ఓబులవారిపల్లె: మండలంలోని కడియాలపల్లెకు చెందిన అబ్బూరి రామకృష్ణ, అబ్బూరి అరుణ, గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి దంపతులు గ్రామంలో నిర్వహిస్తున్న సీతారామ స్వామి కళ్యాణంలో పాల్గొన్నారు. అబ్బూరి నాగయ్య, సుబ్బయ్య, రాజయ్య, మద్దిపట్ల శంకరయ్య, మద్దిపట్ల వెంకటసుబ్బయ్య, పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

రాజంపేట, మార్చి22 : షాహిత్ భగత్‌సింగ్ రాజ్ గురు సుఖ్‌దేవ్ 93వ వర్ధంతి సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నేతి నాగేశ్వర కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు సభలు, సమావేశాలు, ర్యాలీలు, కాగడా ప్రదర్శనలు నిర్వహించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆవిష్కరించామన్నారు. భారతీయులు పోరాటంతోనే స్వాతంత్ర్యాన్ని దక్కించుకున్నారని, పోరాటాలతోనే ఎలాంటి హక్కులనైనా సాధించవచ్చునని ఆయన తెలిపారు. 1931 మార్చి 23న లాహోర్ జైల్‌లో భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లను ఉరితీశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేతలు రామ్‌చరణ్, హేమంత్, దీపిక, మధులత, సతియా, శివన్, ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా యడబల్లి గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వీరబల్లి, మార్చి 22: మండలంలోని గడికోట యడబల్లిలో నిర్మించిన ఆలయంలో శుక్రవారం గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి, విద్యుత్ నియంత్రణా మండలి చైర్మెన్ సీవీ నాగార్జునరెడ్డి అమ్మవారిని అద్దంలో చూసి, అనంతరం ప్రతిష్ఠించిన విగ్రహాన్ని దర్శించి పూజలు చేశారు. అనంతరం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. గడికోటతోపాటు వీరబల్లి నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, మాజీ ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఓఎస్డీ శ్రీనివాసులు, ఎస్‌ఈ శ్రీనివాసులరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు

భద్రకాళీ వీరభద్రుడి సన్నిధిలో 'మేడసాని'



సహస్రావధాని మేడసాని మోహన్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ నిర్వాహకులు

చిట్వేలి, మార్చి 22: ఎంతో చరిత్ర కలిగిన ఆలయాన్ని దర్శించుకోవడం మహాభాగ్యమని సహస్రావధాని మేడసాని మోహన్ అన్నారు. శుక్రవారం పాత చిట్వేలిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయాన్ని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవధాన ప్రక్రియ తెలుగు భాషకు మాత్రమే ప్రత్యేకమని, నిరంతర పఠనం, సాధనతో మాత్రమే సాధ్యమన్నారు. తిరుమల విశ్వనాథం, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, సుబ్బరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహిస్తాం: సీఐ



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నందలూరు, మార్చి 22: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడం తమ లక్ష్యమని మన్నూరు సీఐ మంజునాథరెడ్డి, ఎస్‌ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీలోని అరవపల్లె, ఆర్‌ఎస్‌రోడ్డు ప్రాంతాల్లో శుక్రవారం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఓటర్లు ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా ఓటర్లను భయపెట్టినా, మభ్యపెట్టిన ప్రజలు తమ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

గంగమ్మకు ఘనంగా పూజలు



సుండుపల్లె, మార్చి22: మండల కేంద్రానికి సమీపంలోని బండకాడ ఈడిగపల్లె వద్ద ఉన్న గంగమ్మ ఆలయంలో తిరుణాల సందర్భంగా శుక్రవారం ఘనంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్ర అమ్మవారి ఆలయం వద్ద భజన చేశారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా ప్రపంచ నీటి దినోత్సవం

కలికిరి, మార్చి 23: సహసిద్ధంగా వర్షం ద్వారా సమకూరే నీటిని సంరక్షించుకోవడంతోపాటు పొదుపుగా వినియోగించుకోవాలని పలువురు ఉపాధ్యాయినులు కోరారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు నీటి సంరక్షణ, వినయోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్లే కార్డులు, పోస్టర్లు ప్రదర్శించారు. వ్యవసాయానికి, మానవాళి త్రాగడానికి ప్రధానంగా నీటి వినియోగం జరుగుతుందని చెప్పారు. ఉపాధ్యాయినులు అరుంధతి, ఉషారాణి, సహదేవయ్య, వరప్రసాద్, రఘు, ముబారక్ ఖాన్‌లు పాల్గొన్నారు.

రేపు బంజారా సంఘం ఆధ్వర్యంలో హోలీ

రాయచోటిటౌన్, మార్చి22: హోలీ పండుగను పురస్కరించుకొని ఈ నెల 24వ తేదీ ఆదివారం పట్టణంలోని ఫయాజ్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు బంజారా సంఘ ఆధ్వర్యంలో సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు బంజారా సంఘం కోశాధికారి నారాయణనాయక్ తెలిపారు. శుక్ర వారం ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ హోలీ వేడుకలు ఏ రాజకీయ పార్టీలకు సంబం ధించినవి కాదని, కేవలం బంజారా కమ్యూనిటీ, సంస్కృతి, సంప్రదాయా లను తెలియజేసేందుకు మాత్రమే నిర్వహిస్తున్నామన్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ బంజారా జానపద కళా గాయకుడు బిక్షూనాయక్‌తో పాటు స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామమూర్తి నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు అమ్మునాయక్, ప్రధాన కార్యదర్శి బీలూనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ చంద్రశేఖర్ నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అశోక్‌నాయక్, రెడ్డినాయక్ లు హాజరు కానున్నట్లు ఆయన తెలియజేశారు. కావున అన్నమయ్య జిల్లా పరిధిలోని బంజారా సుగాలి సోదర, సోదరీమణులందరూ ఈ హోలీ పండుగ సంబరాల కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

కార్పొరేట్ కళాశాలలతో అప్రమత్తంగా ఉండాలి

రాజంపేట టౌన్, మార్చి 22: కార్పొరేట్ కళాశాలల ప్రకటనలకు మోసపోయి విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేయవద్దని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సర్వేపల్లి నరసింహ తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఐటీఐ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు 10వ తరగతి పరీక్షల అనంతరం తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువుల కోసం ఏ కళాశాలలో చేర్పించాలన్న విషయంలో తర్జనభర్జన పడుతుంటారని, ఇదే అదునుగా ప్రైవేటు కళాశాలలు ఆదాయం చేసుకుంటాయన్నారు. విద్యార్థులు ఏ కళాశాలలో చదివినా వారి ప్రతిభతోనే ఎదుగుతారని తెలిపారు. ప్రైవేటు కళాశాలల కోసం తల్లిదండ్రులు అప్పులు చేయవద్దని సూచించారు. తమ స్థితిగతులను బట్టి విద్యార్థులను కళాశాలలో చేర్పిస్తే మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, పట్టణ నాయకులు చంగయ్య, గౌరీశంకర్, సుమంత్, హరి, బబ్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

రాజంపేట టౌన్, మార్చి 22: ఓ మహిళపట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని రాజంపేట సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రాజంపేట పట్టణంలోని ఓ కాలనీలో ఒంటరి మహిళ ఇంటికి బుధవారం రాత్రి మోదుగుల పెంచలయ్య వెళ్లి అసభ్యంగా ప్రవర్తించడంతో.. ఆమె అతడిని లోపలే ఉంచి బయట తలుపు గెడియ వేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు ఆయనను అరెస్టు చేసి స్టేషన్ బెయిల్‌పై పంపించామన్నారు. దీనిపై మోదుగుల పెంచలయ్య మాట్లాడుతూ.. ఓ భూ వివాదానికి సంబంధించి కోర్టులో కేసు నడుస్తోందని, ఈ విషయంలో ఎక్స్‌పార్టీ వారు ఆ మహిళను అడ్డుపెట్టుకుని తనపై తప్పుడు కేసు నమోదు చేయించారని అన్నారు.

మెడికల్ రెప్రజెంటేటివ్ ఆత్మహత్య

మదనపల్లె టౌన్, మార్చి 22: మండలంలోని రామాచార్లపల్లె వాసి దశరథశెట్టి కుమారుడు, మెడికల్ రెప్రజెంటేటివ్ అమరనాథ్(30) గురువారం అర్ధరాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పూతలపట్టు మండలాని కి చెందిన అమరనాథ్, శోభారాణి దంపతులు నాలుగేళ్లుగా రామాచార్లపల్లెలో నివాసముంటున్నారు. అమరనాథ్ ఇటీవల ఆర్థిక కారణాలతో ఒత్తిడికి గురయ్యాడు. దీంతో ఇంట్లోనే ఫ్యాన్ కొక్కికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శోభారాణి ఫిర్యాదు మేరకు తాలూకా సీఐ శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు అభయాంజనేయస్వామి తిరుణాల



విద్యుత్ దీపాలంకరణలో ఆలయం

రాయచోటిటౌన్, మార్చి 22: మండల పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామం కుమ్మరపల్లెకు సమీపంలో 23న శనివారం అభయాంజనేయస్వామి తిరుణాల నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. ఉదయం మహా గణపతి పూజ, స్వస్తివాచనము, కలశస్థాపన, నవగ్రహ పూజ, కూష్మాండబలి, అభిషేకములు, అలంకరణ, ఆకుపూజ, కుంకుమార్చన, అష్టోత్తర శతనామావళి పూజలు, మహానైవేద్యము, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం కార్యక్రమాలు ఉంటాయన్నారు.

మధ్యాహ్నం 12 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు మేకల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం, రాత్రి విద్యుద్దీపాలంకరణలు, బ్యాండు మేళాల మధ్య చాందినీ బండ్ల ఊరేగింపు ఉంటుందని తెలియజేశారు. ఈ సందర్భంగా బిత్తిరాళ్ల మల్‌రెడ్డి, వై. రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో రాత్రి 10 గంటల నుంచి నెల్లూరు కళాకారుల కోలాటం ప్రదర్శన ఉంటుందన్నారు.

కేజ్రీవాల్ అరెస్టు దారుణం

రాజంపేట, మార్చి 22 : ఢిల్లీ ముఖ్యమంత్రి, ఏఏపీ అధ్యక్షుడు కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం దారుణమని పీసీసీ అధికార ప్రతినిధి పూలభాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సమయం దగ్గర పడటంతో ఇండియా కూటమిని ఎదుర్కొనే శక్తి లేక భారతీయ జనతా పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు. ప్రభుత్వ యంత్రాగాన్ని ఉపయోగించి కేజ్రీవాల్‌ను అక్రమంగా అరెస్టు చేయించిందన్నారు. తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రులు ఎంతో మందిపై అనేక కేసులు నమోదయ్యాయన్నారు. కేజ్రీవాల్ అరెస్టులో వేగంగా స్పందించిన ప్రభుత్వ యంత్రాంగం మిగిలిన ముఖ్యమంత్రుల విషయంలో ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా ఇండియా కూటమి ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. కేజ్రీవాల్ అరెస్టు తొందరపాటు చర్య అని, అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం పోలీసులకు ఫిర్యాదు

మదనపల్లె, మార్చి 22: బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఓ మహిళ మోసం చేసిందని బాధితులు పోలీసులను ఆశ్రయించారు. నిమ్మనపల్లె మండలం అగ్రహారం పంచాయతీ ఉంటావారిపల్లెకు చెందిన ఎం.నందిని..తమను మోసం చేసిందని తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు..నిమ్మనపల్లె, మదనపల్లె, కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు ప్రాంతాలకు చెందిన చదువుకున్న నిరుద్యోగ యువతుల నుంచి ఆధార్, రేషన్‌కార్డు, ఎడ్యుకేషన్ రికార్డులు తీసుకుందని, శిక్షణ పేరుతో కర్ణాటక ప్రాంతం రాయల్పాడుకు రెండు సార్లు తీసుకెళ్లినట్లు తెలిపారు. శిక్షణ పూర్తయ్యాక..మదనపల్లె, రాయల్పాడు ఏరియాలలో కార్యాలయం ఏర్పాటు చేసి ఉపాధి మార్గాలను చూపిస్తామని చెప్పినట్లు బాధితులు పేర్కొన్నారు. ఇందుకోసం తమ వద్ద రూ.10వేల నుంచి రూ.20వేలు వసూలు చేసినట్లు తెలిపారు. ఇంతకాలం శిక్షణ, కార్యాలయం ప్రారంభం పేరుతో కాలయాపన చేసిన నిందితురాలు..తాము నిలదీస్తే..సరైన సమాధానం ఇవ్వకుండా దాటవేస్తోందని విచారించి తమకు న్యాయం చేయాలని వారు పోలీసులను కోరుతున్నారు. అయితే..నిందితురాలు తమ పరిధిలో లేదని, బాధితులు తమ ఏరియాకు రారని రాయల్పాడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లండని పోలీసులు సూచించినట్లు బాధితులు చెబుతున్నారు. ఇదిలావుండగా, నిమ్మనపల్లె మండలానికి చెందిన నందినికి ఆరేళ్ల క్రితం వివాహం కాగా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండేళ్లుగా భర్తకు దూరంగా ఉంటున్న ఆమె ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నట్లు చెబుతూ..అక్కడ ఉద్యోగాలు ఇప్పిస్తానని యువతుల వద్ద డబ్బులు తీసుకుని మోసం చేస్తున్నట్లు బాధితులు వాపోయారు. ఆమె పనిచేస్తున్న కంపెనీలో మేనేజర్‌గా, సీనియర్ డైరెక్టర్‌గా ఉన్నట్లు విజిటింగ్ కార్డులతో ప్రచారం చేసినట్లు బాధితులు పేర్కొన్నారు.

మెడికల్ రెప్రజెంటేటివ్ ఆత్మహత్య


అమరనాథ్ (ఫైల్‌ఫోటో)

మదనపల్లె టౌన్, మార్చి 22: మదనపల్లె మండలం రామాచార్లపల్లెలో నివాసమున్న దశరథశెట్టి కుమారుడు, మెడికల్ రెప్రజెంటేటివ్ అమరనాథ్(30) గురువారం అర్ధరాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పూతలపట్టు మండలానికి చెందిన అమరనాథ్, శోభారాణి దంపతులు నాలుగేళ్లుగా రామాచార్లపల్లెలో నివాసముంటున్నారు. మెడికల్ రెప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్న అమరనాథ్ ఇటీవల ఆర్థిక కారణాలు, మానసిక ఒత్తిడితో మనస్థాపం చెందేవాడు. దీంతో అతని ఇంట్లోనే ఫ్యాన్ కొక్కికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శోభారాణి ఫిర్యాదు మేరకు తాలూకా సీఐ శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఇంటర్ విద్యార్థి మృతి


జశ్వంత్‌కుమార్ (ఫైల్‌ఫోటో)

ములకలచెరువు, మార్చి 22: వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డ ఇంటర్ విద్యార్థి జశ్వంత్‌కుమార్(25) శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు...మండలంలోని బురకాయలకోట పంచాయతీ బలకవారిపల్లెకు చెందిన జశ్వంత్‌కుమార్(25) ఇంటర్మీడియట్ పరీక్షలు రాసి ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 19న పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో బురకాయలకోటకు బయలుదేరి వెళుతుండగా మార్గం మధ్యంలో బొలెరో వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డ విషయం విదితమే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విద్యార్థిని బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. విద్యార్థి మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా ముంబాయి - చెన్నై జాతీయ రహదారి విస్తరణ పనులు చేస్తున్న డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా వాహనాన్ని నడపడంలో ప్రమాదానికి కారణమైందని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.

మా కుటుంబసభ్యుల నుంచి కాపాడండి

● మదనపల్లె డీఎస్పీకి బాధితుల వినతి


డీఎస్పీతో సమస్యలు తెలుపుతున్న బాధితులు

మదనపల్లె అర్బన్, మార్చి 22: తమ కుటుంబసభ్యుల నుంచి కాపాడాలని శుక్రవారం బాధితులు మదనపల్లె డిఎస్పీకి ఫిర్యాదు చేశారు. బాధితులు వివరాల మేరకు మండలంలోని బసినికొండ పంచాయతికి చెందిన రాజేష్‌కుమార్ అతని భార్య భారతి వారి పిల్లలతో కలిసి డీఎస్పీ కార్యాలయానికి శుక్రవారం ఉదయం వచ్చారు. తాము ఇరువురు మేజర్లమని వివాహం చేసుకుని సజావుగా కాపురం చేసుకొంటున్నామని, మాకు ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. కాగా మా అత్తవారి కుటుంబసభ్యులైన తండ్రి వేణుగోపాలు, తల్లి సునితమ్మ, తమ్ముడు విశ్వనాధ్ నుంచి తనకు, తన భర్త రాజేష్‌కుమార్‌కు ప్రాణహాని ఉందని మాకు రక్షణ కల్పించాలని వారు డీఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికే తాను తన భర్తను వదలివేయాలని భయాందోళనలకు గురి చేస్తూ చిత్రహింసలు పెడుతున్నారని చెప్పారు. మదనపల్లె తాలుకా, టూటౌన్ పోలీసుస్టెషన్లలో అనవరమైన కేసులు పెట్టి అక్కడికి రప్పించుకుని పోలీసుల ద్వారా కొట్టిస్తున్నారని వారు ఆరోపించారు. మాకు ఎవ్వరు అవసరంలేదని మా బతుకు మేము బతుకుతామని, మా అత్తవారి కుటుంబసభ్యులు, పోలీసులు నుంచి బెదిరింపులు ఎక్కువ అయ్యాయని, వారు మాజోలికి రాకుండా న్యాయం చేయాలని వారు డీఎస్పీకి విజ్ఞప్తి చేశారు.

గ్రాఫిక్స్‌లోనే మదనపల్లె అభివృద్ధి

● ఐదేళ్లలో ఎంపీ మిథున్‌రెడ్డి చేసింది శూన్యం

● ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, మార్చి 22: గత ఐదేళ్ల కాలంలో మదనపల్లె అభివృద్ధిని ఎంపీ మిధున్‌రెడ్డి గ్రాఫిక్స్‌లోనే చూపారని, వాస్తవంగా మదనపల్లె అభివృద్ధి శూన్యమని మదనపల్లె టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా విమర్శించారు. శుక్రవారం తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారపార్టీలో ఐదేళ్లు ఎంపీ పదవి అనుభవించిన మిధున్‌రెడ్డి మదనపల్లెను జిల్లా కేంద్రంగా చేయడంలో విఫలమయ్యారని ధ్వజమెత్తారు. సమ్మర్‌స్టోరేజికి నీళ్లు ఇవ్వకుండా జీఎన్ఎస్ఎస్ నుంచి నీళ్లు ఇస్తామని చెప్పడం గ్రాఫిక్స్ మాయలే అన్నారు. మదనపల్లె ప్రభుత్వ మెడికల్ కాలేజిలో ఉద్యోగాలను స్థానికులకు, మెరిట్ వున్నవారికి ఇవ్వకుండా ఒక్కో ఉద్యోగాన్ని రూ.4లక్షలకు విక్రయించిన ఘనత వారిదేనని షాజహాన్‌బాషా ఆరోపించారు. ఎన్ఆర్‌సీ, సీఏఏ బిల్లులకు షరతులు లేకుండా లోక్‌సభలో ఎంపీ మిధున్‌రెడ్డి, రాజ్యసభలో విజయసాయిరెడ్డి ఆమోదించిన విషయం ప్రజలకు తెలుసన్నారు. అక్కడే వైసీపీ నాయకులకు మైనారిటీల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో తెలుస్తోందన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అన్ని విధాల పురోభివృద్ధి సాధిస్తుందన్నారు. జనసేన నేతలు శ్రీరామ రామాంజినేయులు, దారం అనిత ప్రసంగించారు. అనంతరం బసినికొండ యూత్ నంద్యాల హరి ఆధ్వర్యంలో 100 మంది యువకులు షాజహాన్‌బాషా సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విద్యాసాగర్, ఆర్‌జే వెంకటేశ్, ఎస్ఎం రఫి, ఎస్ఏ మస్తాన్, మధుబాబు, ఎం.నాగయ్య, సుద్దిళ్ల సుధాకర్, ప్రభాకర్, కత్తి లక్ష్మన్న, వినోద్, విజయమ్మ పాల్గొన్నారు.

బీసీలు టీడీపీకి వెన్నెముక లాంటివారు

బీసీలు టీడీపీకి వెన్నెముకలా నిలుస్తున్నారని టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మాలేపాడు పంచాయతీ దొనబైలులో నియోజకవర్గ బీసీ విభాగం అధ్యక్షుడు ఎం. నాగయ్య ఆధ్వర్యంలో బీసీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు ఆ తర్వాత చంద్రబాబునాయుడు బీసీల సంక్షేమానికి కృషి చేశారన్నారు. బీసీలు అందరూ టీడీపీని ఆదరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు పాల్గొన్నారు.

కలసికట్టుగా పనిచేద్దాం..పార్టీని గెలిపిద్దాం

మదనపల్లె, మార్చి 22: సాధారణ, అసెంబ్లీ ఎన్నికలు పూర్తవగానే, మున్సిపల్ ఎన్నికలు కూడా జరగనున్నాయని, ఇప్పటి నుంచే మనమంతా కలసికట్టుగా పనిచేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా పేర్కొన్నారు. స్థానిక వాసవీ వీధిలోని టీడీపీ కౌన్సిలర్ పి.తులసీ, పార్టీ నేత బంగారు రామకృష్ణ నివాసంలో శుక్రవారం టీడీపీ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జీలు, బూత్‌కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షాజహాన్‌బాషా మాట్లాడుతూ ప్రస్తుతం ఆయా వార్డుల పరిధి, అందులోని ఓటర్లను గుర్తించి మన ఓట్లు మనకు పడేలా కృషి చేయాలన్నారు. గతంలో వార్డుల్లో, పంచాయతీల్లో ప్రతిపక్షం నుంచి అభ్యర్థులే లేకుండా చేశారని, నామినేషన్ వేసినా చించేశారని, అభ్యర్థికి తెలియకుండానే విత్ డ్రా చేసిన సందర్భాలను వివరించారు. ఈ సమావేశంలో మాజీకౌన్సిలర్లు ఆర్.నీలకంఠ, ఎన్.బాబునాయుడు, సుమంత్ కళ్యాణ్, సాకే లక్ష్మీదేవి, తలారి రాధా, పులి మహాలక్ష్మి, జయమ్మ, విజయలక్ష్మి, నాగమణి, పార్టీ నేతలు సాకే కృష్ణమూర్తి, నవీన్‌చౌదరి, రాటకొండ సోమశేఖర్, మోడెం సిద్దప్ప, తాజ్‌బాషా, పూల మురళి, బాజ్జి, విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

మా భూముల్లో రోడ్డు పనులు ఎలా చేస్తారు?

● రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్నరైతులు


రోడ్డు నిర్మాణ పనుల వద్ద రైతుల ఆందోళన

వాల్మీకిపురం, మార్చి 22: వాల్మీకిపురం మండలంలోని విఠలం గ్రామ పంచాయతీ పరిధిలోని కుందేళ్లవారిపల్లె రోడ్డు నిర్మాణ పనులను తమ పట్టా భూముల మీదుగా ఎలా చేపడుతారంటూ రైతులు అడ్డుకున్నారు. అందులోనూ ఆ రైతులు వైసీపీ మద్దతు దారులు కావడం గమనార్హం. కుందేళ్లవారిపల్లెకు చెందిన చింతల తిమ్మారెడ్డికి సర్వేనెంబరు 99లో 26సెంట్లు, చింతల దామోదర్‌రెడ్డికి 100/1, 100/2లలో 48సెంట్లు, చింతల సామిరెడ్డికి సర్వే నెంబరు 341/1లో 26సెంట్లు వ్యవసాయ భూములు ఉన్నాయి. సంబంధిత రైతులకు ఎకరా భూమిలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే దిశగా ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం తమతో సంప్రదింపులు కానీ, న్యాయపరంగా కానీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా తమ భూములలో రోడ్డు నిర్మాణం చేపట్టడం ఏంటని మండిపడుతున్నారు. గత రెండు రోజులుగా కుందేళ్లవారిపల్లెకు రోడ్డు నిర్మాణ పనులు ఎలాగైనా పూర్తి చేయాలని చూసినా సంబంధిత కాంట్రాక్టర్ వ్యూహం బెడిసికొట్టింది. ఎన్నికల కోడ్ ఉన్నా దౌర్జన్యంగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని చూసిన ఎక్స్‌కవేటర్, కార్మికులను అడ్డుకుని సంబంధిత రైతులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. చేసేదేమి లేక కాంట్రాక్టర్ గుట్టుచప్పుడు కాకుండా అక్కడి నుంచి వెళ్లి ప్రముఖ వైసీపీ నేతల నుంచి సంబంధిత రైతులపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. రోడ్డు నిర్మాణం జరిగే ప్రాంతంలో భూములు కోల్పోయే తమకు కోర్టు ఆదేశాలున్నా అధికారులు కూడా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇదిలా ఉండగా ఎలాగైనా రాత్రికి రాత్రి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని వైసీపీ పెద్దలు సంబంధిత కాంట్రాక్టర్‌కు చెప్పడం. ఎట్టి పరిస్థితుల్లో తాము రోడ్డు పనులను జరగనివ్వమని బాధిత రైతులు హెచ్చరించడం గమనార్హం.

నూతన పనులు చేపట్టలేదు

ఇప్పటికే అగ్రిమెంట్ పూర్తి అయిన పనులుమాత్రమే జరుగుతున్నాయి. కొత్త పనులకు ఎక్కడా అనుమతులులేవు, వాల్మీకిపురం మండలంలోని కుందేళ్లవాకిపల్లె రోడ్డు పనుల కూడా గతంలోనే ప్రారంభమయ్యాయి. అక్కడి సమస్య నా దృష్టికి రాలేదు. అయినప్పటికి పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

-పురుషోత్తం, జేఈ, ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్(పి.ఐ.యు), వాల్మీకిపురం

పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్టు

మదనపల్లె అర్బన్, మార్చి 22: స్థానిక టూటౌన్ పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన వక్తిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ యువరాజ్ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు గురువారం రాత్రి పట్టణం, ఎస్టేట్‌లో కొంతమంది తాగి గొడవ చేస్తున్నారన్న సమాచారం రావడంతో టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అక్కడ ఏమి జరిగిందని విచారిస్తున్న పోలీసులపై అక్కడే ఉన్న మదనపల్లె మండలం, ఇసుకనూతన పల్లెకు చెందిన శ్రీనివాసులు (36) దురుసుగా మాట్లాడడమే కాకుండా పోలీసుల విధులకు ఆటం కం కలిగించారని కేసునమోదు చేసినట్లు తెలిపారు. శుక్రవా రం నిందితుడు శ్రీనివాసులును కోర్టులో ప్రొడ్యూస్ చేయగా ఏప్రిల్ 4వ తేదీ వరకు రిమాండ్‌కు తరలించారని సీఐ తెలిపారు.

కలికిరి పంచాయతీకి కొత్త కార్యదర్శి

కలికిరి, మార్చి 23: కలికిరి మేజర్ పంచాయతీ కార్యదర్శిగా గురుమోహన్‌ను నియమించారు. ఆ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీ నుంచి బదిలీపై ఇక్కడికొచ్చిన గురుమోహన్ ఇప్పటి వరకూ ఇన్‌చార్జీ కార్యదర్శిగా పనిచేసిన మహల్ కార్యదర్శి గోవర్దన్ నుంచి సర్పంచు ప్రతాప్‌కుమార్ రెడ్డి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

మదనపల్లె, మార్చి 22: చెన్నై శంకర్ నేత్రాలయం ఆధ్వర్యంలో 24వ తేదీన (ఆదివారం) ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శివప్రసాద్(చిన్ని) తెలిపారు. కుప్పం సాయి మాతా సేవా ట్రస్టు సారథ్యంలో స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిల్లలకు ఐరన్ టానిక్ తాగించాలి

కలకడ, మార్చి 22:ఆరు మాసాల నుంచి ఐదేళ్లలోపు పిల్లలలో రక్తహీనత రాకుండా ఐరన్ టానిక్‌ను తాగించాలని డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆరోగ్య ఉప కేంద్రానికి 50 ఐరన్ పోలిక్ యాసిడ్ బాటిళ్లను పంపిణీ చేశారు. ప్రతి బుధ, శనివారాలలో కార్యక్రమం నిర్వ హించాలన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌ట్యాప్ వితరణ

మదనపల్లె అర్బన్, మార్చి 22: పేదవిద్యార్థినికి పట్టణం రెడ్డీస్‌కాలనీలోని టీకేఎన్ డెవలపర్స్ అధినేత టి. కృష్ణమూర్తినాయుడు శుక్రవారం రూ. 45 వేలు విలువ చేసే ల్యాప్ ట్యాప్‌ను వితరణగా అందజేశారు. పట్టణానికి చెందిన లక్ష్మణ, పార్వతిల కుమారై తేజశ్విని ఫిజియోథెరపి చదువుతుంది. ఈమెకు కోర్సు ఫీజుతోపాటు ల్యాప్‌ట్యాప్‌ను వితరణ చేశారు. పేద విద్యార్థులకు సేవాకార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీవో హరిప్రసాద్

మదనపల్లె టౌన్, మార్చి 22: ఎన్నికల విధుల్లో ఉన్న నాలుగు ప్రత్యేక బృందాల్లోని అధికారులు 24గంటలు అప్రమత్తంగా ఉండాలని రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హరిప్రసాద్ సూచించారు. శుక్రవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, ఎస్ఎస్‌టీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అన్ని రాజకీయ పార్టీల కార్యక్రమాలపై నిఘా వుంచాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కేసులు పెట్టాలన్నారు. ముఖ్యంగా ఎంపీ లాడ్స్ నిధుల పనులు చేయకూడదన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి రూ.38 లక్షలు, ఎంపీ అభ్యర్థి రూ.95 లక్షలు మించకుండా ఎన్నికల ఖర్చు చేయాలన్నారు. అలా కాకుండా పరిమితి దాటితే ఆ అభ్యర్థిని అనర్హుడుగా ప్రకటిస్తామన్నారు. డీఎస్పీ ప్రసాదరెడ్డి తరఫున తాలూకా సీఐ శేఖర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో వుండే రాజకీయ పార్టీ నాయకులు రూ.50వేలు మించి నగదు తీసుకెళ్లరాదన్నా సామాన్య ప్రజలు రూ.10లక్షల వరకు నగదు తీసుకెళ్లవచ్చన్నారు. రూ.10లక్షలు దాటితే దానికి తగిన రసీదులు చూపించాలన్నారు. నాలుగు బృందాల అధికారులు తనిఖీ చేసే సమయంలో తప్పని సరిగా వీడియో చిత్రీకరించాలన్నారు. ఎన్నికల ప్రచార సామగ్రి కూడా రూ.10వేల లోపు వుంటే అనుమతిస్తామని, ఎక్కువుంటే అభ్యర్థి ఖర్చులో లెక్కిస్తారన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్లు రమాదేవి, బాలాజీరాజు, శ్రీనివాసులు, ఎంపీడీవోలు భానుప్రసాద్, షెల్లెట్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంచడంపై అవగాహన


కలికిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కలికిరి, మార్చి 23: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని గణనీయంగా పెంచడం కోసం ఎన్నికల అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం కలికిరి పట్టణంలో జేఎన్టీయూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఓటింగ్ ప్రాధాన్యతకు సంబంధించిన నినాదాలు చేస్తూ ర్యాలీ జరిపారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండు మీదుగా క్రాస్ రోడ్డు వరకూ ఈ ర్యాలీ జరిగింది. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో మానవ హారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు విజయకుమారి, ఎంపీడీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, జేఎన్టీయూ విద్యార్థులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నీటిని సంరక్షించుకోవాలి

కురబలకోట, మార్చి 22: నీటిని పరిరక్షించుకోవాలని లేకుంటే మానవాళి మనుగడ ప్రశ్నార్థమేనని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ రామనాథన్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో సివిల్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ నీటి సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మ్లాడుతూ నీటిని వృధా చేస్తే భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. డీన్ తులసీరామ్‌నాయుడు, విభాగాధిపతి దీపాంకర్‌రావయ్ పాల్గొన్నారు.

కలికిరిలో: వర్షం ద్వారా సమకూరే నీటిని సంరక్షించుకోవడంతోపాటు పొదుపుగా వినియోగించుకోవాలని పలువురు ఉపాధ్యాయినులు కోరారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు నీటి సంరక్షణ, వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్లే కార్డులు, పోస్టర్లు ప్రదర్శించారు. వ్యవసాయానికి, మానవాళికి ప్రధానంగా నీటి అవసరం ఎక్కువన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు అరుంధతి, ఉషారాణి, సహదేవయ్య, వరప్రసాద్, రఘు, ముబారక్ ఖాన్‌లు పాల్గొన్నారు.

జిల్లాలో తగ్గిన రోడ్డు ప్రమాదాలు

పీలేరు, మార్చి 22: తమ సంస్థ పరిధిలో జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు తగ్గాయని ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం రాము తెలిపారు. పీలేరు బస్టాండు ఎంప్లాయీస్ యూనియన్ నేతలు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని డిపోల పరిధిలో ఘాటు రోడ్డులు ఎక్కువగా ఉండడంతో గతంలో ప్రమాదాలు ఎక్కువగా జరిగేవన్నారు. డ్రైవర్లకు శిక్షణ, కౌన్సెలింగ్, రోడ్డు భద్రతా వారోత్సవాల కారణంగా ప్రమాదాలు తక్కువగా జరి గాయన్నారు. గత ఏడాది జిల్లాలోని మదనపల్లె-1 డిపో పరిధిలో 3 ప్రమాదాలు జరగగా, ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి 3 జరిగాయని, మద నపల్లె-2 డిపో పరిధిలో గత ఏడాది 4 ప్రమాదాలు జరగగా ఈ ఏడాది 3, పీలేరు డిపో పరిధిలో గత ఏడాది 6 ప్రమాదాలు జరగగా ఈ ఏడాది 4, రాజంపేట డిపో పరిధిలో గత ఏడాది 3 ప్రమాదాలు జరగగా ఈ ఏడాది కేవలం ఒకటి, రాయచోటి డిపోలో గత ఏడాది 6 ప్రమాదాలు జరుగగా ఈ ఏడాది కేవలం ఒక ప్రమాదం మాత్రమే జరిగిందన్నారు. ఇకత్వరలోనే జిల్లాకు సుమారు 50 కొత్త బస్సులు రానున్నాయని, వాటిలో పీలేరుకు 7 బస్సులు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎం బండ్ల కుమార్, కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ- జనసేన- బీజేపీతోనే ప్రజా సంక్షేమం


మాట్లాడుతున్న తంబళ్లపల్లి అభ్యర్థి జయచంద్రారెడ్డి సతీమణి దాసరిపల్లి కల్పన

పెద్దమండ్యం, మార్చి 22: రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీలతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని తంబళ్లపల్లి నియోజకవర్గ కూటమి ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి సతీమణి దాసరిపల్లి కల్పన పేర్కొన్నారు. పెద్దమండ్యం మండలంలో శుక్రవారం ఆమె మండలంలోని బండ్రేవు, బండ్రేవు కొత్తపల్లి తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే రాష్ట్రంలో చంద్రబాబు సీఎం అవుతారని తెలిపారు. తంబళ్లపల్లిలో ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డిని గెలిపించి టీడీపీ జెండా ఎగురవేయాలని కోరారు. టీడీపీ గెలుపు కోసం సమష్టిగా సైనికులాగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, గంంగాధర, మహేశ్వర, శేషాద్రి, పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అసత్య ప్రచారాలను నమ్మవద్దు


పీలేరు జెండామాను వద్ద ప్రచారం నిర్వహిస్తున్న నల్లారి తనూజా రెడ్డి

పీలేరు, మార్చి 22: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిపై వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని కూటమి అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజా రెడ్డి ప్రజలను కోరారు. పీలేరు పట్టణంలోని జెండామాను, గాంధీ రోడ్డు, పాతకోట వీధి, కొత్తకోట వీధి, బ్రాహ్మణ వీధి ప్రాంతాల్లో ఆమె తన భర్త నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలోనూ టీడీపీ, బీజేపీ పొత్తులో ఉన్నప్పుడు రాష్ట్రంలోని మైనారిటీలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకున్న ఘనత టీడీపీకి ఉందన్నారు. టీడీపీ తరహాలో తమ కుటుంబం కూడా అనాదిగా ముస్లిం మైనారిటీల వెంట నడిచిందని గుర్తించాలని ఆమె తెలిపారు. వైసీపీ నాయకుల మాయమాటలు నమ్మకుండా వచ్చే ఎన్నికల్లో తన భర్తను గెలిపించాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలు పంచుతూ వాటి గురించి ప్రజలకు వివరించారు. అంతకుముందు ఆమె రాష్ట్రవ్యాప్తంగా కూటమి అభ్యర్థులు విజయం సాధించాలని పెద్దపీర్ల చావిడి, కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మల్లెల రెడ్డిబాషా, కోటపల్లె బాబు, శ్రీకాంత్ రెడ్డి, మహమ్మద్ పీర్, షౌకత్‌అలీ, రియాజ్, ఇస్మాయిల్, అత్తారు చాను, రహంతుల్లా, ఫిరోజ్, బుజ్జు, కేజీఎన్ రెడ్డిబాషా, లక్ష్మీకర, కంచి సూరి, పోలిశెట్టి సురేంద్ర, పురం రెడ్డమ్మ, సాధన, మీనా, షమ, రెడ్డిరాణి, సుభద్రమ్మ, రమాదేవి, వాణి, సలీం, పఠాన్ మౌలా, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో అభివృద్ధి చేసే నాయకులను ఎన్నుకొందాం


గుర్రంకొండలో టీడీపీ పథకాలను ప్రజలకు వివరిస్తున్న నాయకులు

గుర్రంకొండ, మార్చి 22:ఎన్నికల్లో రాష్ట్రం అభివృద్ధి చెందాలంటూ ప్రజలకు మేలు చేసే నాయకులను ఎన్నుకోవాలంటూ గుర్రంకొండ టీడీపీ నాయకులు ప్రజలను కోరారు. పట్టణంలోని చిట్టిబోయిన పల్లె, నాయీబ్రాహ్మణ కాలనీ, దళితవాడలో శుక్రవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ, శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి టీడీపీ ప్రజల కోసం చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్‌కుమార్, నౌషాద్‌అహ్మద్, తారక, సుబ్బరాజు, జయంత్, శ్రీనివాసులు, రంజిత్, రెడ్డెప్ప, బ్రహ్మయ్య, వంశీ, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో రెడ్డిసాహెబ్

మదనపల్లె అర్బన్, మార్చి 22: స్థానిక కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో శుక్రవారం మదనపల్లె నియోజకవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. ఈ మేరకు వారందరికీ రెడ్డిసాహెబ్ పార్టీ కండువాను కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విదివిధానాలు, సంక్షేమ పథకాలు నచ్చి ఎక్కువగా పార్టీలోకి చేరుతున్నట్లు పేర్కొన్నారు. దేశంలో రాహుల్ గాంధీ, రాష్ట్రంలో వైఎస్ షర్మిల ఏపీకి ప్రత్యేక హోదా తేవడమే లక్ష్యంగా పని చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో గ్రామస్థాయి నుంచి పార్టీకి ప్రజల మద్దతు లభిస్తున్నట్లు చెప్పారు. అందరి ఆశీసులతో 2024 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుంటే దేశంలో, రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన వస్తుందన్నా రు. అన్ని వర్గాల వారికి మేలు జరిగేలా కాంగ్రెస్ మేనిఫెస్టో రూపొందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీలో రామారావు కాలనీ, మునెప్పకాలనీ, గౌతమీనగర్, వీవర్స్ కాలనీ నుంచి షాజహాన్, రెడ్డిబాషా, ఇస్మాయిల్, ద్వారకనాథరెడ్డి, మహమూబ్‌బాషా, మహ్మద్‌షరీఫ్, రమణ, నాగరాజుతో పాటు అధిక సంఖ్యలో చేరారు. కార్యక్రమంలో నాయకులు మీనాకుమారి, డాక్టర్ ఎస్‌కే బాషా, సురేంద్రరెడ్డి, మహమ్మద్ రఫీ, నాని, మహ బూబ్‌పీర్, సయ్యద్, నాగరాజ, శ్రీనివాసులు, వెంకటేష్, రవి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

వలంటీర్లు రాజకీయ పార్టీలకు మద్దతు తెలిపితే చర్యలు

నిమ్మనపల్లి, మార్చి 22: ఎన్నికల కోడ్ సందర్భంగా వలంటీర్లు రాజకీయపార్టీలకు మద్దతు తెలిపి వారి వెంట ఎన్నికల ప్రచారం చేపడితే అటువంటి వారిని విధుల నుంచి తొలగిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో చలపతిరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వలంటీర్లను ఎన్నికల కమిషన్ తొలగించినట్లు తెలిపారు. వలంటీర్లతో పాటు ఉద్యోగులు కూడా రాజకీయాలకు దూరంగా వుండి విధులు నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా ఎన్నికల కమిషన్ సి విజిల్ యాప్‌ను ప్రవేశపెట్టిందని ఈ యాప్‌ను ప్రతి ఒక్కరూ వారి సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరిగినా, ఎన్నికల కోడ్ ఉల్లంఘించినా సెల్‌లో ఫొటో, వీడియో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. దానిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకొంటుందని తెలిపారు.

నిమ్మనపల్లిలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు


తనిఖీలు చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

నిమ్మనపల్లి, మార్చి 22: ఎన్నికల కోడ్ అమలె సందర్భంగా నిమ్మనపల్లి పరిసర ప్రాంతాలలో శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్ విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో భాగంగా వాహనదారులను ఆపి వారి సామగ్రితో పాటు నగదు, వాహన వివరాలను అడిగి తెలసుకొంటున్నారు. అలాగే ఇతర రాష్ట్రాల నుంచి మద్యం, గంజాయి, తదితర వాటి సరఫరాపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. ఇవే కాకుండా నలుగురు మించి గుమిగూడి ఉండరాదని, అల్లర్లు, గొడవలు జరగకుండా చూస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు ముగిసేంత వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎన్నికల కోడ్ వచ్చినా ఆర్బీకేకు తొలగని రంగులు



పీటీఎంలో వైసీపీ రంగులతో ఉన్న ఆర్బీకే కేంద్రం

పెద్దతిప్పసముద్రం మార్చి 22 : సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ అమల్లోకి వచ్చినా పీటీఎంలోని నూతన ఆర్బీకే కేంద్రానికి సమీపంలోని పాత ఆర్బీకే కేంద్రానికి వైసీపీ రంగులను తొలగించలేదు. నూతన భవనంలోని ఆర్బీకే కేంద్రాన్ని మార్చినా కూడా వైసీపీ రంగులు అలాగే ఉండి పోయాయి. ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటిస్తామని చెప్పుకునే అధికారులు ఇలా ఎన్నికల నియమావళిని గాలికి వదిలేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. వైసీపీ నాయకులు గతంలో ఎంతో ఆర్భాటంగా అన్ని భవనాలకు వైసీపీ రంగులు వేశారు. అయితే ఎన్నికల కోడ్‌లో భాగంగా ఇవన్నీ మర్చిపోయి ఎన్నికల నిబంధనలకు పాతర వేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పీటీఎంలోని మెయిన్ రోడ్డు సమీపంలో ఆర్బీకే కేంద్రానికి ఇలా వైసీపీ రంగులు దర్శనమిస్తున్నా మండల స్థాయి అధికారులు ఎన్నికల నియమావళిని ఎందుకు పాటించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఎన్నికల నిబంధనలను పాటించాలని పలువురు కోరుతున్నారు.

గుడిపాల స్టేషన్‌లో స్వల్ప ఉద్రిక్తత


టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎస్ఐ

గుడిపాల, మార్చి 22: గుడిపాల పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం టీడీపీ నాయకులు, ఎస్ఐ శ్రీనివాసరావు మధ్య స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళితే.. గుడిపాల పంచాయతీ అనుపు ఎస్టీ కాలనీలో గ్రామస్థుల కోరిక మేరకు టీడీపీ నాయకులు.. మాజీ సర్పంచి రవినాయుడు, తెలుగు యువత అధ్యక్షుడు శంకర్ తాగునీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. ఆ సింథటిక్ ట్యాంకు పసుపు రంగులో ఉండడంతో స్థానిక వైసీపీ వాళ్లు కొందరు ఎస్ఐకు ఫిర్యాదు చేశారు. దీంతో రవినాయుడు, శంకర్‌ను ఎస్ఐ స్టేషన్‌కు తీసుకొచ్చారు. కంపెనీ వాళ్లు ఇచ్చిన మేరకు ట్యాంకు పసుపు రంగులో ఉందని, దాని మీద ఎలాంటి పార్టీ గుర్తులు, పేర్లు లేవని చెప్పినా ఆయన వినిపించుకోలేదు. బైండోవర్ చేస్తానని ఎస్ఐ చెప్పడంతో టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున పోలీసు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. దీంతో ఎస్ఐ వారిని పంపించేసి శనివారం మళ్లీ రావాల్సి ఉంటుందని చెప్పారు.

నీళ్ల ట్యాంకుకు వైసీపీ రంగు



బంగారుపాళ్యం, మార్చి 22: బంగారుపాళ్యం మండలం కాటప్పగారిపల్లె పంచాయతీ ఎద్దులవారిపల్లె గ్రామసమీపంలోని తాగునీటి ట్యాంకుకు వైసీపీ రంగులున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా ఆ రంగులను మార్చకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

ఇవిగో నేతల ఫొటోలు

- కోడ్ వచ్చినా అలాగే ఉంచారంటూ సోషల్ మీడియాలో విమర్శలు
- పెయింట్ వేయించిన అధికారులు


శిలాఫలకాలపై పేపర్లు అతికించి, వైసీపీ రంగులపైనా వేరే రంగు వేయిస్తున్న అధికారులు


శుక్రవారం మధ్యాహ్నం సుజల ప్లాంట్‌పై సీఎం, మంత్రి ఫొటోలకు రంగులేశారిలా..

రామకుప్పం, మార్చి 22: ఎన్నికల కోడ్ వచ్చింది. అయినా, రామకుప్పంలోని దిగువవీధిలో సుజల ప్లాంట్‌పై దివంగత సీఎం వైఎస్ఆర్, సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫొటోలు.. స్థానిక మినీ మార్కెట్ యార్డు ఆవరణలో శిలాఫలకాలపై వైసీపీ రంగులు అలాగే ఉన్నాయి. అధికారులపై తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో టీడీపీ శ్రేణులు వాటికి సంబంధించి వీడియోలు, ఫొటోలను శుక్రవారం ఉదయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. ఎంపీడీవో ఈశ్వరయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటరవిప్రసాద్, వీఆర్వో మహేష్ తదితర అధికారులు స్పందించారు. వెంటనే సుజలప్లాంట్‌పై ఉన్న నేతల ఫొటోలపై సిమెంటు కలర్ పెయింట్ వేయించారు. మినీమార్కెట్ యార్డు వద్ద శిలాఫలాకాలను పేపర్లతో కప్పి, గోడలపై ఉన్న వైసీపీ రంగులపై సిమెంటు కలర్ వేయించారు. అలాగే,పట్టణంలో పలు చోట్ల ఉన్న టీడీపీ భవిష్యత్తుకు భరోసా గోడపత్రికలపైనా సిమెంటు కలర్ పెయింట్ వేశారు. గ్రామకార్యదర్శులు, వీఆర్వోల తీరుపై ఎంపీడీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలను సందర్శించి ప్రభుత్వ భవనాలు, ఇతర సామగ్రిపై రాజకీయనేతల ఫొటోలు, పబ్లిక్ ప్లేస్‌లలో రాజకీయ పార్టీల గోడపత్రికలుంటే శనివారం సాయంత్రంలోగా వాటిపై వేరే రంగులు వేయించాలని ఆదేశించారు.

కాలికి గాయమై వస్తే హెచ్ఐవీ వుందన్నారు!

- రుయాస్పత్రి ల్యాబ్ సిబ్బంది తప్పుడు రిపోర్టుతో వైద్యులు ఆపరేషన్ చేయలేమన్నారు
- కుంగిపోయిన ఎర్రావారిపాళెం యువకుడు

తిరుపతి(వైద్యం), మార్చి 22 : రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రికి వస్తే చికిత్సలో భాగంగా చేసిన రక్త పరీక్షల్లో హెచ్ఐవీ పాజిటివ్ అని తప్పుడు రిపోర్టు ఇచ్చి చికిత్స చేయకుండా ఇబ్బందులకు గురి చేయడంపై బాధితుడు రుయాస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు.బాధితుడి కథనం మేరకు ఎర్రావారిపాళెం మండలానికి చెందిన ఓ యువకుడు ఈ నెల 13న రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కాలికి తీవ్రగాయం కావడంతో కుటుంబ సభ్యులు రుయాస్పత్రిలో అడ్మిట్ చేయించారు. కాలికి సర్జరీ చేయాలన్న వైద్యులు రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అదే రోజు ఆస్పత్రిలోని ల్యాబ్‌లో రక్త నమూనాలు ఇవ్వడంతో సిబ్బంది పరీక్షలు నిర్వహించి మరుసటి రోజు రిపోర్టు ఇచ్చారు. అందులో హెచ్ఐవీ పాజిటివ్ అని ఉండడంతో ఆ యువకుడు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యాడు. అనుమానం వచ్చి అదేరోజు పక్కనే స్విమ్స్‌లో రక్త పరీక్షలు చేయించగా అక్కడ హెచ్ఐవీ నెగటివ్ వచ్చింది. ఆ రిపోర్టును తీసుకువచ్చి రుయాస్పత్రి వైద్యులకు చూపించి తనకు వెంటనే సర్జరీ చేయాలని కోరినా వారు పట్టించుకోలేదని బాధితుడు వాపోయారు. తిరిగి రుయాస్పత్రిలో ఈ నెల 20న రక్త పరీక్ష చేయించగా అందులో హెచ్ఐవీ నెగటివ్ వచ్చింది. మొదట ఇచ్చిన తప్పుడు రిపోర్టు వలన తన కుమారుడు మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమయ్యాడని, దీనికి తప్పుడు రిపోర్టు ఇచ్చిన రుయాస్పత్రి సిబ్బందే కారణమని బాధిత యువకుడి తండ్రి వాపోయాడు.దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ రవిప్రభును శుక్రవారం కోరారు.

రుయాస్పత్రిలో రీటెండరు మాయాజాలం

- పారిశుధ్య ఏజన్సీ నియామకంలో కాలయాపన
- వేరొక పేరుతో పాత వారికే కట్టబెట్టే యత్నం


టెండరు వేస్తున్న అభ్యర్థి

తిరుపతి(వైద్యం), మార్చి 22 : నిబంధనలు పాటించకుండా అవకతవకలకు పాల్పడుతున్న ఏ-1 పారిశుధ్య ఏజన్సీని తక్షణమే రద్దు చేసి ఆ స్థానంలో మరొక ఏజన్సీని నియమించాలని ఐదు నెలల కిందట డీఎంఈ, కలెక్టర్ ఆదేశించారు. వాటిని ఏ మాత్రం పట్టించుకోకుండా ఐదు నెలలుగా అధికారులు కాలయాపన చేస్తున్నారు. దీని వెనుక పెద్ద మాయాజాలమే జరుగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. రుయా, ఎస్వీ వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలకు సంబంధించి పారిశుధ్య పనులను ఏ-1 ఏజన్సీ చూస్తోంది.వారు నిబంధనలు పాటించకపోగా 205 మంది కార్మికులకు గాను కేవలం వంద మందితో పనిచేయిస్తుండడం, తక్కువ వేతనాలు చెల్లించడం వంటి ఫిర్యాదులు రావడంతో కొత్తవారిని నియమించాలని గత ఏడాది అక్టోబరులో డీఎంఈ నరసింహం రుయా అధికారులను ఆదేశించారు. కానీ కలెక్టర్ అందుబాటులో లేరని, డీఎంఈ నుంచి రాతపూర్వకంగా ఆదేశాలు రాలేదని రుయా అధికారులు కాలయాపన చేస్తూ వస్తున్నారు. ఏజన్సీ నిర్వహణకు మే 31వ తేదీ వరకే గడువు ఉండటం, ఆపై మరో రెండేళ్లు పొడిగించే అవకాశం ఉండటంతో ప్రస్తుత ఏజన్సీ నిర్వాహకులు అధికార పార్టీకి చెందిన కొందరు ముఖ్యనేతల నుంచి రుయా అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు సమాచారం. కలెక్టర్ ఈ విషయాన్ని తెలుసుకుని తక్షణమే రీటెండరు నిర్వహించాలని ఆదేశించడంతో శుక్రవారం రీటెండరు ప్రక్రియ మొదలుపెట్టారు. నాలుగు టెండర్లు వచ్చినట్లు రుయా అధికారులు తెలిపారు. ప్రస్తుత ఏజెన్సీ నిర్వాహకులు కూడా బినామీ పేర్లతో టెండర్లు వేసినట్లు సమాచారం. మరి అధికారులు దీనిపై ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది.

సంస్కృత వర్సిటీలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్

తిరుపతి(రూరల్), మార్చి 22: జాతీయ సంస్కృతవర్సిటీలో మోడల్ కెరీర్‌సెంటర్ ఆధ్వర్యంలో అరుణాచల్ ప్రదేశ్‌లోని వివేకానంద కేంద్ర పాఠశాలలో సంస్కృత అధ్యాపకుల నియామకాల కోసం శుక్రవారం రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఎనిమిది అధ్యాపక పోస్టులకు 50 మందికిపైగా విద్యార్థులు హాజరైనట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్‌జే రమాశ్రీ పేర్కొన్నారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, మోడల్ కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ జేబీ చక్రవర్తి, వివేకానంద కేంద్ర పాఠశాల ప్రిన్సిపాల్ కె.జయసర్కార్, హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి అనిమేశ్, మారుతి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి

- జిల్లా ఎన్నికల అధికారి షన్మోహన్



చిత్తూరు కలెక్టరేట్, మార్చి 22: ఎన్నికల ప్రచారాల్లో భాగంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనల నిమిత్తం మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతి తప్పనిసరి అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. కమిటీని కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఏర్పాటు చేశామన్నారు. తన అధ్యక్షతన ఏర్పడిన ఈ కమిటీలో ఏఆర్వోగా డీఆర్వో పుల్లయ్య, సోషల్ మీడియా ఎక్స్‌పర్ట్ నాగేశ్వరరావు, ఐఈఏఈ బీకే సుధాకర్, మీడియా ప్రతినిధులుగా సీపీరావు, ఎం.శ్రీనివాస మూర్తి, ఐఅండ్‌పీఆర్ డీడీ పద్మజ వ్యవహరిస్తారన్నారు. ప్రసార అనుమతుల కోసం వచ్చే పొలిటికల్ అడ్వర్టైజ్‌మెంట్లు నిబంధనల మేరకు ఉన్నాయో లేదో కమిటీ పరిశీలించి ప్రీసర్టిఫికెట్ ఇస్తుందన్నారు. ఈ సర్టిఫికేషన్ లేకుండా ప్రసారం చేస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వారంలోగా ఓటరు నమోదు, బదిలీ పరిశీలన పూర్తిచేస్తాం

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఓటరు నమోదు, బదిలీ తదితరాలకు సంబంధించిన 6, 7, 8 దరఖాస్తు ఫారాల పరిశీలన వారంరోజుల్లోపు పూర్తిచేస్తామని కలెక్టర్ షన్మోహన్ అన్నారు. శుక్రవారం విజయవాడ నుంచి ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి హాజరైన షన్మోహన్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. త్వరలో పీవో, ఏపీవోలకు రెండో విడత శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. కలెక్టరేట్ నుంచి డీఆర్వో పుల్లయ్య పాల్గొన్నారు.

అంకుర సంస్థల ఏర్పాటుపై దృష్టి సారించండి



తిరుపతి(రూరల్),మార్చి22: వ్యవసాయ కోర్సులు చదివే విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా అంకుర సంస్థల ఏర్పాటుపై దృష్టి సారించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సి.రమణ పేర్కొన్నారు. ఆర్ఏఆర్ఎస్‌లో ఆర్‌కేవీవై రాఫ్తార్‌పథకం ద్వారా నిర్వహించే ఆంగ్రు అగ్రి బిజినెస్ ఇంక్యుబేటర్ ఆధ్వర్యంలో శుక్రవారం అగ్రివిజన్1.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఏడీఆర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారం చూపే విధంగా ఆవిష్కరణలు రూపొందించి, తద్వారా కొత్త సంస్థల ఏర్పాటుకు ముందుకు రావాలని తెలిపారు. కాగా అగ్రి బిజినెస్ కేంద్రం ద్వారా శిక్షణ పూర్తి చేసి, ఆర్థిక సహకారం అందుకున్న మొదటి, రెండవ బ్యాచ్‌లకు చెందిన అంకుర సంస్థలకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి.బాల హుస్సేన్‌రెడ్డి, డాక్టర్ పీవీ సత్యగోపాల్, డాక్టర్ ఆర్.కల్పనాశాస్త్రి, ఎం.శ్రీనివాసరెడ్డి, సి.సునీల్ పాల్గొన్నారు.

ఏపీని డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చేసిన వైసీపీ

- మాజీ మంత్రి అమర్ ఆవేదన

బైరెడ్డిపల్లె, మార్చి 22: టీడీపీ హయాంలో పరిశ్రమల స్థాపనకు, పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉండేదని, అలాంటి రాష్ట్రాన్ని ఇప్పుడు వైసీపీ డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చేసిందని మాజీమంత్రి అమరనాథరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన బైరెడ్డిపల్లె మండలం కమ్మనపల్లె పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలో గంజాయి ఎక్కడ పట్టుబడినా దాని మూలాలు ఆంధ్రప్రదేశ్‌లో దొరుకుతుండడం చూస్తుంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుస్తోందన్నారు. కల్తీమద్యం మాఫియాతో ఇన్నాళ్లు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ, యువతను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. యువతను మత్తుకు బానిసచేసి వారు ప్రశ్నించడానికి వీలుకాకుండా అణగదొక్కేశారని ఆవేదన వ్యక్తంచేశారు. డ్రగ్స్ కుంభకోణం వెనుక తాడేపల్లి హస్తంవుందని, అందుకే వైసీపీనేతలు తీవ్రంగా స్పందిస్తున్నారని విమర్శించారు. విశాఖ కేంద్రంగా డ్రగ్స్ మాఫియాను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడానికి ప్రయత్నిస్తున్నారని తీవ్రంగా దుయ్యబట్టారు. అన్నపూర్ణలాంటి ఆంధ్రప్రదేశ్‌ను వైసీపీ పాలనలో డ్రగ్స్ ఆంధ్రగా మార్చేశారని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలన్నిటినీ ప్రజలు అర్థం చేసుకుంటున్నారని, వైసీపీకి తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా వున్నారన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం


రాజశేఖర్ (ఫైల్ ఫొటో)

శాంతిపురం, మార్చి 22: శాంతిపురం మండలంలో ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై దుర్మరణం పాలయ్యాడు. బురడసిద్దనపల్లెకు చెందిన రాజశేఖర్(17) శుక్రవారం మేత కోసం పశువులను స్థానిక ఖుషీడైరీ సమీపంలోని వ్యవసాయ పొలాలకు తీసుకెళ్ళాడు. పశువుల కోసం జొన్న ఆకులు కోసేందుకు పొలం వద్ద గల ఓ చెట్టుపైకి ఎక్కాడు. దురదృష్టవశాత్తు చెట్టు పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తగిలి రాజశేఖర్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాళ్ళబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.





పుష్కరిణిలో మలయప్ప కటాక్షం

తిరుమల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : తెప్పోత్సవాల్లో భాగంగా రెండురోజుల పాటు శ్రీరామ, శ్రీకృష్ణ రూపాల్లో దర్శనమిచ్చిన శ్రీవారు మూడో రోజైన శుక్రవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిగా తెప్పపై భక్తులను కటాక్షించారు.అంతకుముందు ఉత్సవమూర్తులను మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం పుష్కరిణిలో తెప్పపై కొలువుదీర్చారు. విద్యుద్దీపాల వెలుగులు, వేదం, నాదం, గోవిందనామస్మరణల మధ్య తెప్పపై శ్రీవారు విహరించారు.శనివారం ఐదుచుట్లు, ఆదివారం ఏడుచుట్లు పుష్కరిణిలో తెప్పపై మలయప్ప స్వామి విహరించనున్నారు.

రెండు గంటలు ఆలస్యంగా ఏపీ సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్

తిరుపతి సెంట్రల్ మార్చి22 : తిరుపతి-నిజాముద్దీన్ స్టేషన్ల మధ్య నడిచే ఏపీ సంపర్క్ క్రాంతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం ఉదయం రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరింది. నిజాముద్దీన్ నుంచి తిరుపతికి చేరుకున్న ఈ ఎక్స్‌ప్రెస్‌కు మరమ్మతులు చేసే సమయంలో రెండు జనరల్ కోచ్‌లు రవాణాకు ఉపయోగపడవని కోచ్ అండ్ వ్యాగన్ శాఖ అధికారులు నిర్ధారించారు.ప్రత్యామ్నాయ బోగీలను సకాలంలో ఏర్పాటుచేయకపోవడంతో తిరుపతి నుంచి 21 పెట్టెలకు బదులు 19 పెట్టెలతోనే రైలు బయల్దేరింది. తద్వారా దాదాపు 200 మంది ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. శుక్రవారం ఉదయం 5.30 గంటలకు బయలుదేరాల్సిన ఈ ఎక్స్‌ప్రెస్ 7.45 గంటలకు బయలుదేరినట్లు అధికారులు తెలిపారు.

మద్యం తరలిస్తూ దొరికిపోయారు!

- ఇద్దరు సేల్స్‌మేన్, ఇద్దరు ట్రాన్స్‌పోర్టర్ల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 22 : తిరుపతి రూరల్ మండలం తనపల్లిలోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి మద్యం తరలిస్తున్న నలుగురిని శుక్రవారం సెబ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.40వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. సెబ్ రూరల్ సీఐ భీమలింగం సిబ్బందితో కలసి మద్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. తనపల్లి దుకాణంలో పనిచేస్తున్న బండి అబ్దుల్ రెహ్మాన్, ఎస్.రాజా శుక్రవారం 102 రాయల్ ప్యాలెస్ క్వార్టర్ బాటిళ్లను యుగంధర్, చెంజి సుబ్రహ్మణ్యం ద్వారా స్కూటీలో తిరుచానూరుకు తీసుకెళుతున్నారు. సెబ్ అధికారులు తనపల్లి ఐస్ ఫ్యాక్టరీ వద్ద వారిని పట్టుకుని మద్యం స్వాధీనం చేసుకున్నారు.

ప్చ్... ఈసారీ అంతేనా!

- మామిడిలో కనిపించని పూత
- దిగుబడిపై రైతుల ఆందోళన



పలమనేరు, మార్చి 22: జిల్లాలో ఈసారి కూడా మామిడిలో సాధారణ దిగుబడి కూడా వచ్చే సూచనలు కనిపించడం లేదు. మామూలుగా అయితే, ఇప్పటికే మామిడి తోటలు పూతతో కళకళలాడుతుండాలి. కానీ, ఇందుకు భిన్నంగా లేత ఆకులతోను, పచ్చదనంతో ఉండి పూత నామమాత్రంగా కనిపిస్తోంది. ఉద్యానవన లెక్కల మేరకు ఈ ఏడాది పంట దిగుబడి గణనీయంగా తగ్గుతుందని అంచనా. వాతావరణంలో వచ్చిన పెనుమార్పులే దీనికి కారణమని అంటున్నారు. గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో అధికారులు మామిడి రైతులకు సమావేశాలు నిర్వహించి పూత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అయితే పూతే నామమాత్రంగా కనిపిస్తుండటంతో మామిడి రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా మామిడి సాగు చేయాలంటే ఎకరాకు కనీసం రూ.2.5 లక్షల ఖర్చు అవుతోంది. ఇక ఉన్న మామిడి తోటల నిర్వహణకు కూడా ఎకరాకు కనీసం రూ.లక్ష వ్యయమవుతోందని రైతులు అంటున్నారు. మామిడి తోటల మధ్యఉన్న భూమిని చెత్తా చెదారం లేకుండా ఏపుగా దున్నించడం, కొమ్మలు కత్తిరించడం, కనీసం మూడు పర్యాయాలు రసాయన మందుల పిచికారి చేయించాల్సి ఉంటుందని చెబుతున్నారు. కూలీల కొరత.. ఇవన్నీ పెట్టుబడిపై ప్రభావం చూపుతున్నాయని రైతులు అంటున్నారు.

సగమైనా దిగుబడి వస్తుందా?

జిల్లాలో 54,732 హెక్టార్లలో మామిడి తోటలు సాగుచేస్తున్నారు. ఇందులో గరిష్ఠంగా బంగారుపాళ్యం మండలంలో 6091 హెక్టార్లలో.. కనిష్ఠంగా గుడుపల్లె మండలంలో 33 హెక్టార్లలో మామిడి సాగవుతోంది. సాధారణ దిగుబడి వస్తే హెక్టారుకు 10 టన్నులు ఉండాలి. వాతావరణ మార్పులు కారణంగా పూత అంతంత మాత్రం రావడంతో హెక్టారుకు 4నుంచి 6 టన్నుల మేరకైనా దిగుబడి వస్తుందా అని రైతులు ఎదురు చూస్తున్నారు.

ఊజీల బెడద

కూలీలు, పంట దిగుబడులు తగ్గిపోవడంతో పాటు కొన్నేళ్లుగా మామిడి కాయలకు ఊజీ ఈగలు గుడ్లు పెడుతున్నాయి. ఇవి మామిడి కాయలు బాగా పక్వం దశలో వుండగా పెట్టే గుడ్లు మామిడి కాయలు మాగే దశలో కాయ మొత్తం పురుగులు దర్శనమిస్తున్నాయి. దీంతో ఊజీ ఈగల పట్ల మామిడి రైతులు అధికారుల సూచనలు పాటించడం లేదని తెలుస్తోంది. సస్యరక్షణతో పాటు క్రిమి కీటకాలు, ఊజీల నివారణకు అధికారులు సూచనలు పాటించాల్సిన అవసరం వుంది.

బీమా ఏదీ?

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఒక్కో మామిడి చెట్టుకు రూ.40 నుంచి 50 వరకు బీమా చేయించుకొని పంట నష్టం జరిగితే పరిహారం అందేది. దీనివల్ల ఎంతో కొంత ఊరట కలిగేదని రైతులు అంటున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ క్రాప్ ద్వారా మామిడి పంటను నమోదు చేస్తున్నప్పటికీ బీమా వర్తింపజేయడం లేదని రైతులు చెబుతున్నారు.

సిండికేట్లను అరికట్టాలి

జిల్లాలో పండే మామిడి పంటలో దాదాపు 70 శాతానికిపైగా ఇక్కడి పల్ప్ ఫ్యాక్టరీలు కొంటున్నాయి. అయితే మామిడికి డిమాండు ఉన్నప్పటికీ ఈ ఫ్యాక్టరీల సిండికేట్ కారణంగా తక్కువ ధరలే ఇస్తున్నారని రైతులు అంటున్నారు. ప్రభుత్వం సిండికేట్లను అరికడితే తమ కు గిట్టుబాటు ధర వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

ఎగుమతులకు కొరగాని దిగుబడులు

వాస్తవానికి మామిడి ఎగుబడులకు తగిన విధంగా రైతులు పండించడం లేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. పంటల దిగుబడి, సస్యరక్షణల కోసం రైతులు విపరీతంగా వినియోగించే రసాయన అవశేషాలు మామిడిలో వున్నందును విదేశాలకు ఎగుమతి చేసే అవకాశాలు లేకుండా పోతోందని చెబుతున్నారు. తగిన సూచనలు తీసుకొని పాటిస్తే అధిక లాభాలు వచ్చే అవకాశం లేకపోలేదని అధికారులు చెబుతున్నారు.